# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం



రిపోర్టర్లు కావలెను

ప్రజాక్షేత్రం

కాల్ : 9177920459



సంపుటి: 01 | సంచిక: 323 | హైదరాబాద్ | శనివారం | 10-05-2025 | పేజీలు: 08




# రంగంలోకి సుదర్శన చక్రం

## పాక్ కు నిద్ర లేకుండా చేస్తోన్న ఎస్-400.. ఎందుకంత స్పెషలో తెలుసా!


పాక్ కు నిద్ర లేకుండా చేస్తోన్న ఎస్-400..


**న్యూ ఢిల్లీ ( మే 09) ప్రజాక్షేత్రం:** ఆపరేషన్ సిందూర్ తర్వాత దాయాది దేశం పాకిస్తాన్ పిచ్చెక్కినట్లు వ్యవహరిస్తోంది. భారత్ పై ప్రతీకారం తీర్చుకుంటామని చెప్పిన పాక్ ప్రధాని.. ఇందుకు అనుగుణంగా భారత్ పైకి యుద్ధ విమానాలు, మిసైళ్లు, ఆత్మాహుతి డ్రోన్లను ప్రయోగించింది. అయితే ఏ ఒక్కటి భారత్ ను డ్యామేజ్ చేయలేకపోవడం గమనార్హం. మన దేశానికి చెందిన అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్.. ఎస్ 400 సుదర్శన్ చక్ర.. పాక్ ప్రయోగించిన వాటిని సమర్థవంతంగా అడ్డుకొని నేలకూల్చింది. దేశాన్ని పెను ప్రమాదం నుంచి కాపాడింది. దీంతో ఒక్కసారిగా ఎస్ 400 సుదర్శన్ చక్ర పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. దాని శక్తి సామర్థ్యాల గురించి తెలుసుకునేందుకు భారతీయులు ఆసక్తిక కనబరుస్తున్నారు. కాబట్టి ఎస్ 400 ప్రత్యేకతలేంటో ఇప్పుడు చూద్దాం.

**రష్యా నుంచి దిగుమతి..**

S400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ను రష్యా నుంచి భారత్ కొనుగోలు చేసింది. రష్యా తయారు చేసిన అత్యంత అధునాతన లాంగ్‌రేంజ్ సర్ఫేస్ టుఎయిర్ మిసైల్ (SAM) సిస్టమ్‌లలో ఒకటి. భారత్ తో ఉన్న సన్నిహిత, ద్వైపాక్షిక, స్నేహపూర్వక సంబంధాల రీత్యా భారత్ కు ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ను అందించేందుకు రష్యా ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా 2018లో ఈ డిఫెన్స్ సిస్టమ్ కోసం భారత్ రష్యాల మధ్య 5.43 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 35,000 కోట్లు) ఒప్పందం కుదిరింది. మొత్తం ఐదు స్క్వాడ్రన్‌లకు గాను 2021, 2022, 2023 సంవత్సరాల్లో


మిగతా 2వ పేజీలో..


## ఉగ్రవాదులను చంపితే వీళ్ల కేంటి నొప్పి?



- చంపుతూ పోతుంటే చూసుకుంటూ పోవాలా?
- మోడీ శాంతి కోరుకున్నాడు కాబట్టే ఇన్నాళ్లు యుద్ధం జరగలేదు
- ఉగ్రవాదులను మద్దతు పలికితే దేశద్రోహులే


2


## బార్డర్ కు వెళ్లి యుద్ధంలో పాల్గొంటా...

- పాక్ ది హేయమైన చర్య
- ఉగ్రవాదాన్ని సపోర్ట్ చేస్తోంది
- ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు




2


## మళ్లీ మోసపోవద్దు!



- స్థానిక ఎన్నికల్లో సీరియస్‌గా పోటీ చేస్తాం
- రైతుబంధు మొదటి పంటకే గతి లేదు
- ధాన్యం కొనుగోళ్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది


2


## హామీలను నెరవేర్చే పరిస్థితి లేదు

- సీఎం రాజీనామా చేయాలి
- మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలి
- యుద్ధ వాతావరణంలో పోటీలు నిర్వహణ తప్పుడు సంకేతం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ర్యాలీ




2


## నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళాలు ఇద్దాం

ఒక నెల వేతనాన్ని ఇవ్వాలని కోరిన సీఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రేవంత్ విజ్ఞప్తి




2


## నేటి నుంచి మిస్ వరల్డ్ పోటీలు

- గచ్చిబౌలిలో ఏర్పాట్లు పూర్తి
- 110 దేశాలకు చెందిన పోటీదారులురాక
- 150 దేశాల్లో ప్రోగ్రాం టెలీకాస్ట్
- ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి, హాజరుకానున్న మంత్రులు
- హైదరాబాద్ కు వచ్చిన మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా
- పలుదేశాలకు చెందిన పోటీదారులు రాక



# రంగంలోకి సుదర్శన చక్రం

మొదటిపేజీ తరువాయి

రష్యా మూడింటిని డెలివరీ చేసింది. మరొకటి ఈ ఏడాది చివరిలో.. ఐదవది 2025 నాటికి భారత్ కు రానుంది.

**కీలక స్థానాల్లో ఏర్పాటు..**

S400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కు నాటో దేశాలను సైతం ఎదిరించిన ఘనత ఉంది. రష్యా నుంచి దిగుమతి అయిన S400 స్క్వాడ్రన్‌లలో మూడింటిని భద్రతా పరంగా ఎంతో కీలకమైన మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. పఠాన్‌కోట్ (జమ్మూ & కాశ్మీర్, పంజాబ్ రక్షణ కోసం), రాజస్థాన్ గుజరాత్‌లో స్ట్రాటజిక్ ప్రాంతాలు, సిలిగురి కారిడార్ (నార్త్‌ఈస్ట్ రక్షణ కోసం) వీటిని మోహరించి పెట్టింది. ప్రతి స్క్వాడ్రన్ లో రెండు బ్యాటరీలు, ప్రతీ బ్యాటరీలో 6 లాంచర్లు ఉన్నాయి. వీటితో పాటు రాడార్, కంట్రోల్ సెంటర్, 128 మిసైల్స్ ఒక స్క్వాడ్రన్ లో ఉంటాయి.

**S-400 ప్రధాన సామర్థ్యాలు**

S400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్.. విస్తృతమైన రేంజ్ ను కలిగి ఉంది. 600 కి.మీల దూరంలోని లక్ష్యాలను సైతం ఇది గుర్తించగలదు. 400కిలోమీటర్ల వరకూ మిసైళ్లను ప్రయోగించి శత్రుదేశాలకు చెందిన యుద్ధ విమానాలు (F16, F35, సుఖోయ్ 30), క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిసైళ్లు, డ్రోన్లు, ఇతర హానికర వాయుసేన వస్తువులను నాశనం చేయగలదు. దీని రియాక్షన్ టైమ్ కూడా చాల తక్కువగానే ఉంటుంది. 510 సెకన్లలో కదులుతున్న టార్గెట్ ను లాక్ చేసి నేలకూల్చకూలదు.

**నాలుగు రకాల క్షిపణలు**

S400 ట్రయంఫ్ మొత్తం నాలుగు రకాల క్షిపణులను కలిగి ఉంటుంది. వాటి ఛేదన పరిధి ఆధారంగా వాటిని విభజించారు. 40N6E (400 కి.మీ. పరిధి), 48N6DM (250 కి.మీ), 9M96E2 (120 కి.మీ.) 9M96E (40 కి.మీ.) పేరుతో పిలిచే ప్రతి స్క్వాడ్రన్ వాహనంలో ఉంటాయి. మరోవైపు S400 డిఫెన్స్ సిస్టమ్.. ఒకే సమయంలో 80 లక్ష్యాలను ట్రాక్ చేయగలదు. 36 టార్గెట్లను ఒకేసారి ఛేదించగలదు. అంతేకాదు ఆకాశంలో 30 మీటర్ల నుండి 30 35 కి.మీ. ఎత్తులో ప్రయాణిస్తున్న లక్ష్యాలను నాశనం చేయగలదు. డ్రోన్స్ దగ్గర నుంచి బాలిస్టిక్స్ క్షిపణుల వరకూ దేనినైనా ఈ డిఫెన్స్ సిస్టమ్ అడ్డుకోగలదు.



# మళ్లీ మోసపోవద్దు!

- స్థానిక ఎన్నికల్లో సీరియస్‌గా పోటీ చేస్తాం..
- రైతుబంధు మొదటి పంటకే గతి లేదు
- ధాన్యం కొనుగోళ్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్(మే 09):**

తొందర్లోనే స్థానిక ఎన్నికలు వస్తాయని, స్థానిక ఎన్నికల్లో సీరియస్‌గా పోటీ చేస్తాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లు మోసపోయాం అని, మళ్లీ మోసపోవద్దని కేసీఆర్ చెప్పారని.. కానీ తాత్కాలికంగా మోసపోయాం అని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని, రుణమాఫీ కూడా చేయలేకపోయిందని మండిపడ్డారు. రైతుబంధు మొదటి పంటకే గతి లేదు అని ఎద్దేవా చేశారు. పేదలకు అండగా నిలిచేది బీఆర్ఎస్ మాత్రమే అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో పర్యటించిన కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

'పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం ఉంది, రాజకీయాలు మాట్లాడాల్సిన సమయం కాదు ఇది. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. రుణమాఫీ కూడా చేయలేకపోయారు. ఒక్క జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు, మన ప్రభుత్వం పోయాక ముగ్గురుకి పదవులు వచ్చాయి. సీతారామ ప్రాజెక్టును కేసీఆర్ నిర్మాణం చేపట్టారు. డిప్యూటీ సీఎం భట్టి మధిరలో గెలవడానికి బాండ్ పేపర్ మీద సంతకాల చేసి నీటికి వచ్చిన వాగ్దానాలు చేశారు. 125 ఏళ్ల చరిత్ర గలిగిన పార్టీ అని భట్టి చెప్పారు.. ఇప్పుడు ఆ హామీలు ఏమయ్యాయి. 17 నెలల తర్వాత వున్న స్కీములు పోయాయి. ఇప్పుడు కేసీఆర్ కిట్ పోయింది. రైతుబంధు మొదటి పంటకే గతి లేదు. ఫ్రీ బస్, తులం బంగారం అన్నారు.. ఎటుపోయాయి. ఖమ్మం జిల్లా అంతా మార్పు అన్నారు. ఇప్పుడు ఏమి అయ్యింది' అని కేటీఆర్ ప్రశ్నించారు.

'అయిదేళ్లు మేము ప్రక్కకు ఉంటాము. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చారు. వాటిని మేము వదిలిపెట్టేది లేదు. రేవంత్ రెడ్డి మాదిరిగా ఏ సీఎం కూడా ఇలా మాట్లాడలేదు. ఢిల్లీకి పోతే రేవంత్ రెడ్డిని దొంగల మాదిరిగా చూస్తున్నారు అని అంటున్నారు. నిజమే రేవంత్ రెడ్డి దొంగే కదా. ఓ సీఎం అలా మాట్లాడవచ్చా. రేవంత్ రెడ్డిని చూస్తే కేంద్రం దొంగలా చూస్తోంది. ఒక్క ఓటుకి శిక్ష అయిదేళ్లు. తొందర్లోనే స్థానిక ఎన్నికలు వస్తాయి, సీరియస్‌గా పోటీ చేస్తాం. నాయకులూ ప్రజల్లో ఉండాలి, ధాన్యం కల్లాల వద్ద మనమే ఉండాలి. ఇక్కడ ఎమ్మెల్యేని గెలిపించాం, కాంగ్రెస్ లో చేరారు. భద్రాచలం ఉప ఎన్నిక వస్తుంది, ఉమ్మడి జిల్లా క్యాడర్ భద్రాచలం వెళ్లి గెలిపించుకుందాం. 50 ఏళ్లు మోసపోయాం, మళ్ళీ మోసపోవద్దని కేసీఆర్ చెప్పారు కానీ.. తాత్కాలికంగా మోసపోయాం. పేదలకు అండగా నిలిచేది బీఆర్ఎస్ మాత్రమే అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.



## శంషాబాద్ విమానాశ్రయంలో భద్రత కట్టుదిట్టం

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్(మే 09):**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఐఎస్ఎఫ్ బలగాల పర్యవేక్షణను పెంచారు. 24 గంటల పాటు డేగ కళ్లతో విమానాశ్రయానికి భద్రత కల్పిస్తున్నారు. స్థానిక శాంతి భద్రతల విభాగం, ఇంటెలిజెన్స్, ఎస్‌బీ పోలీసుల సమన్వయంతో విమానాశ్రయానికి భద్రత కల్పించారు. విమానాశ్రయం చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

ప్రయాణికులు 3 గంటల ముందే విమానాశ్రయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి శ్రీనగర్, అమృత్‌సర్, జోధ్‌పూర్, చండీగఢ్, రాజ్‌కోట్ వెళ్లే విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు.



# ఉగ్రవాదులను చంపితే వీళ్లకేంటి నొప్పి?

- చంపుతూ పోతుంటే చూసుకుంటూ పోవాలా?
- మోడీ శాంతి కోరుకున్నాడు కాబట్టే ఇన్నాళ్లు యుద్ధం జరగలేదు
- ఉగ్రవాదులను మద్దతు పలికితే దేశద్రోహులే

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్(మే 09):**

భారత్ నిజంగా యుద్ధం చేస్తే ప్రపంచ చిత్రపటంలో పాకిస్తాన్ ఉండదని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ప్రధాని మోడీ శాంతి కోరుకున్నాడు కాబట్టే ఇన్నాళ్లు యుద్ధం జరగలేదని, దేశం ఎంతో సంయమనం పాటించిందన్నారు. ఆడ బిడ్డలకు అన్యాయం జరిగింది కాబట్టే.. ఇద్దరు ఆడబిడ్డలు ధర్మయుద్ధానికి నాయకత్వం వహించారన్నారు. ఏ ఒక్క పాకిస్తానీ సామాన్యుని ముట్టుకోలేదని, కేవలం ముష్కరుల స్థావరాలపైనే దాడి జరిగిందన్నారు. దేశ సహనాన్ని చేతకాని తనం అనుకుంటే తగిన బుద్ధి చెప్తాం అని ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో జరిగిన 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అవగాహన సదస్సులో రఘునందన్ రావు పాల్గొన్నారు.

'గత మూడు రోజులుగా ఆపరేషన్ సింధూర్ పేరుతో ధర్మ యుద్ధం చేస్తుంటే.. ఈ దేశ తిండి తింటూ కొందరు విమర్శిస్తున్నారు. అందులో కమ్యూనిస్టులు, పలు రంగుల జెండాల లీడర్లు, జర్నలిస్టు ముసుగులో అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారు. ఉగ్రవాదులను చంపితే వీళ్లకేంటి నొప్పి. బట్టలిప్పి మతం తెలుసుకొని మరీ చంపుతుంటే ఎటుపోయారు ఈ సోకాల్డ్ లీడర్లు. చంపుతూ పోతుంటే.. చూసుకుంటూ పోవాలా?. కాళ్లకు పారాణి అరక ముందే సింధూరం కోల్పోయారు. భారత్ నిజంగా యుద్ధం చేస్తే ప్రపంచ చిత్రపటంలో పాకిస్తాన్ ఉండదు. ప్రధాని మోడీ శాంతి కోరుకున్నాడు కాబట్టే ఇన్నాళ్లు యుద్ధం జరగలేదు. దేశం ఎంతో సంయమనం పాటించింది. ఆడ బిడ్డలకు అన్యాయం జరిగింది కాబట్టే ఇద్దరు ఆడ బిడ్డలు ధర్మయుద్ధానికి నాయకత్వం వహించారు' అని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.

'ఏ ఒక్క పాకిస్తానీ సామాన్యుని ముట్టుకోలేదు. కేవలం ముష్కరుల స్థావరాలపైనే దాడి జరిగింది. దేశ సహనాన్ని చేతకాని తనం అనుకుంటే తగిన బుద్ధి చెప్తాం. ఈ రాష్ట్రంలో ఉన్న రోహింగ్యాలను, బంగ్లాదేశీయులను, పాకిస్తానీలను ఎపుడు ఏరివేస్తావని ముఖ్యమంత్రిని అడుగుతున్నాం. ర్యాలీలతో మద్దతు రాదు. దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా మాట్లాడే ఉద్యోగులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కొందరు ప్రొఫెసర్లు దేశ సంపదలో జీతం తీసుకుంటూ ఉగ్రవాదులపై ప్రేమ కురిపిస్తున్నారు. ఉగ్రవాదులను మద్దతు పలికితే దేశద్రోహులే. కన్న తల్లికి అన్నం పెట్టని వాళ్ళే ఇలాంటి మాటలు మాట్లాడుతారు' అని ఎంపీ రఘునందన్ రావు చెప్పుకొచ్చారు.



# బార్డర్ కు వెళ్లి యుద్ధంలో పాల్గొంటా...

- పాక్ ది హేయమైన చర్య
- ఉగ్రవాదాన్ని సపోర్ట్ చేస్తోంది
- ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్(మే 09):**

పాకిస్థాన్ తో భారత్ యుద్ధ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ దొంగ దాడులను ఇండియన్ ఆర్మీ ధీటుగా ఎదుర్కొందని ప్రశంసించారు. పూర్తి స్థాయి యుద్ధమే వస్తే.. అవసరం అయితే వెళ్లి బార్డర్ లో యుద్ధంలో పాల్గొంటానని సంచలన ప్రకటన చేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో మన ఇండియన్ ఆర్మీ సాహసాన్ని చూసి దేశం గర్విస్తోందని తెలిపారు. 'పహల్గాంలో పాకిస్థాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు అత్యంత ఘాతుకానికి ఒడిగట్టారు. టెర్రరిస్టులు నిరాయుధులైన వారిని కాల్చి చంపడం అమానవీయ చర్య. హిందూ, ముస్లింల మధ్య విభేదాలు పెంచడానికే ఇలాంటి పని చేశారు. దానికి ప్రతీకారంగా ఇండియా చేస్తున్న స్ట్రైక్ అద్భుతం' అంటూ కొనియాడారు.

'నేను మిలటరీలో పని చేశా. నాకు యుద్ధం గురించి అవగాహన ఉంది. రఫెల్, డ్రోన్ లను మొన్న ఆపరేషన సింధూర్ లో వాడారు. కామికజెన్ డ్రోన్ లను కూడా వాడారు. మన బార్డర్ లో ఉండి టార్గెట్ ను చేజ్ చేశారు. బార్డర్ ను కూడా క్రాస్ చేయలేదు. హ్యామర్ అనే బాంబులను ఇండియన్ ఆర్మీ ఉపయోగించింది. 100 కిమీ వరకు టార్గెట్ ను సక్సెస్ చేశారు. మన రఫెల్ ను కూల్చేశాం అని పాక్ చేస్తున్న ప్రచారం ఉత్తదే. మన ఇండియన్ ఆర్మీ బలం ఏంటో ప్రపంచం చూసింది. ఇలాంటి సమయంలో అందరూ ఆర్మీకి మద్దతుగా ఉండాలి. ఎలాంటి ఫేక్ ప్రచారాలు నమ్మొద్దు. ఇలాంటి క్లిష్ట సమయంలో రాజకీయాలు చేయబోం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం' అంటూ ఉత్తమ్ చెప్పుకొచ్చారు.



# నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళాలు ఇద్దాం

- ఒక నెల వేతనాన్ని ఇవ్వాలని కోరిన సీఎం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రేవంత్ విజ్ఞప్తి

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్(మే 09):**

భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. పాక్ దుస్సాహసాలపై వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి అండగా నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రతిపాదించారు. ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని సీఎం కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విరాళాన్ని ప్రకటించనున్నారు. మరోవైపు, ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం ముందుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# హామీలను నెరవేర్చే పరిస్థితి లేదు

- హామీలను నెరవేర్చే పరిస్థితి లేదు
- సీఎం రాజీనామా చేయాలి
- మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలి
- యుద్ధ వాతావరణంలో పోటీలు నిర్వహణ తప్పుడు సంకేతం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఆపరేషన్ సిందూర్ కు మద్ధతుగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ర్యాలీ

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్(మే 09):**

పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం రాకపోతే, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి లేనప్పుడు పదవి నుంచి తప్పుకోవాలని సూచించారు. ఆపరేషన్ సిందూర్ కు మద్ధతుగా, భారత సైన్యానికి సంఘీభావంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు జరిగిన భారీ ర్యాలీకి ఎమ్మెల్సీ నాయకత్వం వహించారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో పాకిస్తాన్ చేసిన దాడుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశంలో యుద్ధ వాతావరణలో నెలకొన్న ఈ సమయంలో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని, ఐపీఎల్ ను వాయిదా వేసినట్లుగా మిస్ వరల్డ్ పోటీలను కూడా వాయిదా వేయాలని సూచించారు. దేశంలో యుద్ధ వాతావరణ నెలకొంటే దేశంలో అందాల పోటీలు పెట్టారన్న అపవాదు తెలంగాణకు వస్తుందన్నారు. ఇది విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయమని, తప్పుడు సంకేతాలకు తావునివ్వకూడదని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ లోని 9 ఉగ్రవాద స్థావరాలను దిగ్విజయంగా భారత సైన్యం ధ్వంసం చేసిందని ప్రశంసించారు. సైన్యం వల్ల మనకు రక్షణ కలుగుతుందని, కాబట్టి వారికి ధైర్యం, స్థైర్యాన్ని నింపడానికి ర్యాలీ చేశామని చెప్పారు. పాకిస్తాన్ మన దేశంలోని ఎయిర్ పోర్టులను టార్గెట్ చేసుకొని చేసిన దాడులకు భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టిందని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఇలాంటి ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 'ఇది ధర్మయుద్ధం..భారత్ ఎప్పుడూ తప్పు చేయదు..నీతి, నిజాయితీతోనే యుద్ధం చేస్తున్నాం..మనం పాకిస్తాన్ భూభాగంలోని సామాన్య ప్రజలను ఏమి అనలేదు.. కేవలం ఉగ్రవాద స్థావరాలనే ధ్వంసం చేశామని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగులైన, ప్రజలైనా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలనే అమలు చేయాలని అడుగుతున్నారని, కానీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే విధంగా సీఎం మాట్లాడడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు.



# నేటి నుంచి మిస్ వరల్డ్ పోటీలు

- గచ్చిబౌలిలో ఏర్పాట్లు పూర్తి
- 110 దేశాలకు చెందిన పోటీదారులురాక
- 150 దేశాల్లో ప్రోగ్రాం టెలీకాస్ట్
- ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి, హాజరుకానున్న మంత్రులు
- హైదరాబాద్ కు వచ్చిన మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా
- పలుదేశాలకు చెందిన పోటీదారులు రాక
- ఘనస్వాగతం పలికిన అధికారులు

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్(మే 09):**



మిస్ వరల్డ్ పోటీలు ఘనంగా ప్రారంభంకానున్నాయి. అందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. గచ్చిబౌలి స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. స్టేడియంలో రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం వరకు 110 దేశాలకు చెందిన పోటీదారులు హైదరాబాద్ కు చేరుకున్నారు. ప్రారంభోత్సవంలో 2500 మంది పాల్గొననున్నారు. అందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. పాకిస్తాన్ తో వార్ దృష్ట్యా స్టేడియంతో పాటు రాజధాని, పోటీదారులు సందర్శించనున్న 22 టూరిజం ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మిస్ వరల్డ్ పోటీలను ప్రారంభించనున్నారు.

రాష్ట్రంలో తొలిసారి మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలను 150 దేశాల్లో లైవ్ టెలికాస్టు చేయనున్నారు. దీంతో తెలంగాణ టూరిజంను ప్రమోట్ చేసేందుకు వేదికగా ఈ పోటీలను వినియోగించుకోవాలని, అందుకు అనుగుణంగా ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఈ పోటీల్లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా స్వాగత ఏర్పాట్లు చేశారు. పోటీదారులు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన వెంటనే డప్పు వాయిద్యాలు, నృత్య ప్రదర్శన, కుంకుమ తిలకం దిద్ది స్వాగతించారు. వారికి ట్రిడెంట్ హోటల్ లో వసతి ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 110 దేశాల నుంచి పోటీదారులు హాజరయ్యారు. వారందరికి ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించింది. గురు, శుక్రవారాల్లో పోటీదారులు రీహార్సల్స్ నిర్వహించారు.

**నేడు గచ్చిబౌలిలో పోటీలు ప్రారంభం**

మిస్ వరల్డ్ పోటీలు ఈ నెల 10 నుంచి 31వ తేదీవరకు కొనసాగనున్నాయి. గచ్చిబౌలి స్టేడియంలో పోటీలు ప్రారంభమవుతున్నాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి 2500మంది ప్రతినిధులకు పాసులు ఇచ్చారు. సీఎం, మంత్రులతో పాటు 800 మంది వీఐపీలు, 300మంది వరకు కంటెస్టులు, వారితో వచ్చిన వారు ఉండగా మిగిలినవారు మీడియా ప్రతినిధులు, కొంతమంది సామాన్య ప్రజలకు సైతం పాసులు జారీ చేశారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 5.30 గంటల నుంచి స్టేడియం గేట్లు ఓపెన్ చేసి అతిధులకు ఎంట్రీ సదుపాయం కల్పిస్తారు. వీఐపీలకు 6.15 గంటలకు, 6.30 గంటలకు ప్రారంభ కార్యక్రమం స్టార్ట్ అవుతుంది. మ్యూజిక్ తో తెలంగాణప్రభుత్వం, పోటీల నిర్వాహకులు, ఏయే దేశాల నుంచి పోటీదారుల గురించి మీడియో ప్రదర్శన చేయనున్నారు. సాయంత్రం 6.33గంటలకు సింగర్స్ రాష్ట్రగీతం పాడనున్నారు. 6.36 గంటలకు 250 మందితో పేరిణి నృత్య ప్రదర్శన ఉంటుంది. 6.45 గంటలకు తెలంగాణ టూరిజంపై వివరించనున్నారు. 6.47 గంటలకు కొమ్ముకోయ నృత్య ప్రదర్శన, 7.06 గంటలకు గుస్సాడి నృత్యం, 7.27 గంటలకు లంబాడీ డ్యాన్స్, 7.45 గంటలకు ఒగ్గుడోలు నృత్య ప్రదర్శన, 8.04 గంటలకు మిస్ వరల్డ్ కంటెస్టుదారుల వాక్ , 8.06 ఇండియా ఫ్లాగ్, 8.12 గంటలకు జాతీయ గీతం, 8.17 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి పోటీలను ప్రారంభించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత పోటీలను నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ లిమిటెడ్ ఛైర్పర్సన్, సీఈవో జూలియా ఈవెలిన్ మోర్లీ సైతం ప్రసంగించనున్నారు. 8.24 గంటలకు కార్యక్రమం ముగియనుంది.

**భద్రత కట్టుదిట్టం**

స్టేడియం వద్ద మూడంచెల భద్రతను ప్రభుత్వం నియమించింది. పాకిస్తాన్ తో యుద్ధం జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని పోటీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. చిన్న సంఘటన జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. నిత్యం మానిటరింగ్ చేస్తుంది. అందులో భాగంగానే విమానాశ్రయం వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారికి, వారు ఉంటున్న హోటల్ వద్ద కూడా భద్రతను పెంచింది.

**హైదరాబాద్ కు వచ్చిన మిస్ వరల్డ్**

హైదరాబాద్ లో మిస్ వరల్డ్ పోటీలకు చెక్ రిపబ్లిక్ దేశానికిచెందిన మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా శుక్రవారం వచ్చారు. ఆమెకు అధికారులు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికారు. మోంటెనెగ్రో దేశానికి చెందిన అండ్రీయా నికోలిక్, అల్బెనియా చెందిన కంటెస్టెడ్ హైదరాబాద్ కు వచ్చారు. వారికి అధికారులు స్వాగతం పలికారు.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
10.05.2025
శనివారం | హైదరాబాద్



## చందానగర్ లో భారీ అగ్ని ప్రమాదం

**రెండవసారి భారీ అగ్నిప్రమాదం ఒకే బిల్డింగ్**

**శేరిలింగంపల్లి మే 09(ప్రజాక్షేత్రం):** చందానగర్ లో శుక్రవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చందానగర్ మెయిన్ రోడ్డులోని సెంట్రో షోరూంలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. గతంలోనూ ఓసారి ఇదే బిల్డింగ్ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అందులోనే నూతనంగా సెంట్రోను ఏర్పాటు చేశారు. తాజాగా శుక్రవారం సాయంత్రం సెంట్రో నేమ్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. ఆ మంటలు క్రమంగా బిల్డింగ్ మొత్తం వ్యాపించాయి. వెంటనే అప్రమత్తం అయిన సిబ్బంది షో రూమ్ నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలు వ్యాపించడంతో అందులో ఉన్న సామాగ్రి పూర్తిగా దగ్ధం అయింది. అలాగే పక్కనే ఉన్న ఆర్ కే కలెక్షన్ షో రూమ్ కు మంటలు వ్యాపించాయి. దీంతో క్షణాల వ్యవధిలోనే ఆ షోరూం కూడా అగ్నికి ఆహుతి అయింది. దాని పక్కనే వూమ్బ ఆస్పత్రికి మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా ఘటనా స్థలానికి చేరుకోవడంతో సెంట్రో, ఆర్ కె కలెక్షన్ షోరూంలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఆర్ కె కలెక్షన్ పక్కనే వూంబ్ ఫెర్టిలిటీ ఆస్పత్రికి కూడా స్వల్పంగా మంటలు వ్యాపించగా ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే అప్రమత్తమైన అందులోని సిబ్బంది, రోగులను బయటకు తీసుకువచ్చారు. ఈ మంటల్లో ఆస్పత్రి ఏసీలు కొద్దిమేర దగ్ధ అయ్యాయి. అయితే ప్రమాదం జరుగుతున్న సమయంలో మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు వూంబ్ ఫెర్టిలిటీ ఆస్పత్రిలోని ఫైర్ సేఫ్టీ పైప్ లను ఆన్ చేసేందుకు యత్నించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఫైర్ సేఫ్టీ పైప్ లు నామమాత్రంగానే పెట్టారని, వాటివల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఫైర్ సేఫ్టీ సిబ్బంది తీవ్రంగా మండిపడ్డారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు వచ్చిన వాహనాల్లోనూ నీరు అయిపోవడంతో జలమండలి ట్యాంకర్లను తీసుకువచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నించారు. అనంతరం బాహుబలి ఫైర్ ఇంజన్ ను తీసుకువచ్చి సుమారు 10 ఫైర్ ఇంజన్ల సహాయంతో గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. చందానగర్ మెయిన్ రోడ్డులో అగ్ని ప్రమాదం జరగడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఫైర్ సేఫ్టీ వాహనాలు వచ్చేందుకు కూడా ఇబ్బంది ఏర్పడింది. జనాలు భారీగా గుమిగూడడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు.

# ఘనంగా మెగా జాబ్ మేళా

- ముఖ్య అతిధిగా హాజరైన హోం మంత్రి అనిత
- గతంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేవు
- నేడు మంత్రి లోకేష్ కృషి వలన యువతకు ఉపాధి దొరుకుతుంది
- దేశ రక్షణ కోసం మన సైనికులు వీరోచితంగా పోరాడుతున్నారు

**పెందుర్తి,మే 09(ప్రజాక్షేత్రం):** పెందుర్తి నియోజకవర్గంలోని పి.యం. గవర్నమెంట్ హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మేగా జాబ్ మేళా ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్రంగా ఇబ్బందులు ఎదురైనట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం ఎన్డియే ప్రభుత్వం యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా జాబ్ మేళాలను నిర్వహిస్తోందని తెలిపారు. రైతుల త్యాగాల వల్లే రాష్ట్రంలో కంపెనీలు స్థాపించబడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఐటీ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. రాబోయే ఏడాది కాలంలో పది వేల ఉద్యోగాలు విశాఖలో రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో పహల్గామ్ ఘటనపై స్పందిస్తూ, ఎన్డియే ప్రభుత్వం తీవ్రంగా బాధపడిందని, భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ ద్వారా గట్టి ప్రతిస్పందన ఇస్తోందని చెప్పారు. దేశ సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. జాబ్ మేళా సందర్భంగా పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. చివరగా మంత్రి అనిత “నరేంద్ర మోదీ చేస్తున్న కృషికి మద్దతుగా వందేమాతరం” నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు.





## బీరప్ప పండుగకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన దొడగుంటపల్లి గ్రామ యాదవ సంఘం

**పెద్దమందడి మే 09(ప్రజాక్షేత్రం):**

పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ ఆదివారం వరకు నిర్వహించే బీరప్ప పండగలలో పాల్గొనాలని గ్రామ యాదవ సోదరులు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ని శుక్రవారం ప్రత్యేకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందిస్తూ ఆహ్వానించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం తప్పకుండా హాజరవుతారని తెలిపారు. ఆహ్వానం పలికిన వారిలో కాంగ్రెస్ పార్టీ మాజీ వార్డు సభ్యులు భిరయ్య, పండగల నిర్వహణ కమిటీ సభ్యులు ఆవుల శ్రీశైలం, అవును వెంకటేష్, కొండన్న తదితరులు పాల్గొన్నారు.



## సాయుధ పోరాట వీరుడు బీమిరెడ్డి

- తూచ్నేటి తరం యువత బీమిరెడ్డి ని ఆదర్శంగా తీసుకోవాలి.
- వేలాది ఎకరాలు భూములు పంచిన చరిత్ర బీమిరెడ్డి.
- తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు, పంతంగి వీరస్వామి గౌడ్.

**సూర్యాపేట టౌన్ మే 09(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుడు బిమిరెడ్డి నర్సింహ రెడ్డి అని ఆయన చేసిన సాయుధ పోరాట చరిత్ర మరువలేనిదని జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు పంతంగి వీరస్వామి గౌడ్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60ఫీట్ల రోడ్డు లో భీమిరెడ్డి నర్సింహారెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి విలేకరులతో మాట్లాడారు. భీమిరెడ్డి నరసింహారెడ్డి భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వేలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిన చరిత్ర ఆయనకి దక్కిందన్నారు. ప్రజాక్షేత్రంలో మూడు సార్లు ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజా సమస్యలపై చట్టసభల్లో గొంతెత్తిన ధీశాలి అని గుర్తు చేశారు. ఆనాడు చాకలి ఐలమ్మ కు అండగా నిలిచి ఆమెను తెలంగాణ సాయుధ పోరాటానికి సన్నద్ధం చేసిన నాయకుడు అని చెప్పుకొచ్చారు. నేటి తరం యువత భీమిరెడ్డి నర్సింహారెడ్డి ని ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో రాణించాలని సూచించారు. నల్లగొండ జిల్లా కరివిరాల కొత్తగూడెం లో పుట్టిన కమ్యూనిస్టు యోధుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి ప్రపంచ చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. సూర్యాపేట జిల్లాలో భీమిరెడ్డి నరసింహారెడ్డి జ్ఞాపకార్థంగా ఒక ఎకరం స్థలం స్మారక భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రియల్ ఎస్టేట్ పట్టణ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్, జిల్లా గౌర సలహాదారుడు దేవత్ కిషన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి పాల సైదులు, అయితే గాని మల్లయ్య గౌడ్, ఖమ్మం పార్టీ అంజయ్య గౌడ్, ఆకుల మారయ్య గౌడ్, పట్టణ గౌరవ సలహాదారుడు మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, పట్టేటి కిరణ్, నల్లకుంట అయోధ్య, ఇటువంటి రాంబాబు, లింగారెడ్డి, సారగండ్ల కోటేష్, తదితరులు పాల్గొన్నారు.



## చేవెళ్ల మండలంలో బడి బాట సందడి

**తంగడపల్లి పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం**

**చేవెళ్ల మే 09(ప్రజాక్షేత్రం):** రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు మళ్లీ తెరుచుకోనున్న సందర్భంగా చేవెళ్ల మండలంలోని తంగడపల్లి ప్రాథమిక పాఠశాలలో బడి బాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించగా, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. వేసవి సెలవులు ముగిసిన తరువాత పిల్లలు కొత్త ఆశలతో, కొత్త బస్తాలతో పాఠశాల బాట పట్టాలని అన్నారు. విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులతో ఊరు పేరును మరియు పాఠశాల పేరును ప్రజలు చెప్పుకునేలా నిలబెడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేసి కూడా సరైన విద్య బోధన చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందించే నాణ్యమైన ఆహారం మంచి విద్య పిల్లలకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తును నిర్మిస్తుందని తెలిపారు. బడి బాట ద్వారా ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల హాజరు పెంపొందించడమే తమ లక్ష్యమని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు.



## భూ సరిహద్దులు నిర్ణయించి పట్టాలు పంపిణీ చేయండి.

**ఇల్లంతకుంట మే 09(ప్రజాక్షేత్రం):** గతంలో ప్రభుత్వం ఇచ్చినటువంటి ఇళ్ల స్థలాల యొక్క భూమిని సర్వే చేపించి సరిహద్దులను నిర్ణయించాలని మండల తహశీల్దార్ మహమ్మద్ ఫారూఖ్ హుస్సేన్ కి వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘ సభ్యులు ఇల్లంతకుంట తాహశీల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1978లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దళితులకు నివాస స్థలాల కోసం పట్టాలు ఇవ్వడం జరిగిందని అందులో భాగంగా కొన్ని ప్లాట్లకు సంబంధించి భూసేకరణ చేసి పంపిణీ చేయకుండా అలాగే వదిలేశారని గత రెండు సంవత్సరాల క్రితం దళితులు అప్పటి తహశీల్దార్ కి సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరిగింది. కానీ అదే సర్వే నెంబర్ లో ఉన్న ఒక రైతు ఈ భూమి తనదే అని ప్రభుత్వం తప్పుగా సర్వే చేసిందని కోర్టు ద్వారా అంబేద్కర్ యువజన సంఘ సభ్యులకు నోటీసులు ఇవ్వడం జరిగింది. కాబట్టి రెవెన్యూ అధికారులు మరొకసారి అట్టి భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించి 1978లో ఎంతమందికి పట్టా ఇచ్చినరో చేశారో దానికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని తాసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకుని అట్టి మరొక్కమారు సర్వే చేసి దానికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పసుల నరేష్, సీనియర్ నాయకులు పసుల వెంకటి, గన్నేరం నర్సయ్య, అంబేద్కర్ సంఘ సభ్యులు అనిల్, సంజిత్, అనిల్, శ్రీనివాస్, లచ్చయ్య, మల్లేశం గ్రామ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు – మంత్రి పొంగులేటి!

**హైదరాబాద్ మే 09(ప్రజాక్షేత్రం):** అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమా చార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రకటించారు. ప్రెస్ అకాడమీ భవనాన్ని ఈ నెలాఖరులోగా ప్రారంభిస్తామని, మంత్రి అన్నారు. వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలవారీగా పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాంపల్లి ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనానికి మరమ్మతులు పూర్తి చేయించి ఈ నెలాఖరులో ప్రారంభిస్తామని తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొంది స్తామని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు, అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమీ ఖర్చు పెడుతుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు.



## 25 లక్షల అండర్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన

**ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం చేసిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**నారాయణపురం,మే 09(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నారాయణపురం గ్రామం లో శుక్రవారం ప్రత్యేక అభివృద్ధి నిధులనుండి (6.45 లక్షల) వ్యయం తో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించరు, స్థానిక ప్రజలకు శుద్ధిచేసిన తాగునీరు అందించాలని ఉద్దేశంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం గ్రామంలో 25 లక్షల వ్యయంతో చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే ప్రభుత్వంతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రజలు డ్రైనేజ్ సమస్య వల్ల ఇబ్బంది పడకుండా ఈ అండర్ డ్రైనేజీ నిర్మిస్తున్నామని తెలిపారు తక్షణమే టెండర్ని పిలిచి నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కరంటోతూ శ్రీను నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కిడి చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్చందర్ రెడ్డి, వాంకుడొతూ బుజ్జి, పిఎసిఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, బిచ్య నాయక్ఎండీ అక్బర్ అలీ, నోముల మాధవరెడ్డి, ఏపూరి సతీష్ , ఉప్పల లింగస్వామి, మునగాల రమణారెడ్డి, దోనూరు జయపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మడల అధ్యక్షుడు రెడ్యానాయక్, ఐఎన్టీయూసీ నాయకులు ఎస్ కే బడే సాబ్, రాచకొండ లింగస్వామి, దొల్ల గణేష్, ఉప్పల నాగరాజు, గునిగంటి రాజు, శేఖర్ యాదవ్, యండి రహీమ్ షరీఫ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జీసస్ లవ్స్ గొస్పెల్ చర్చి 9వ వార్షికోత్సవం

**మాక్లూర్,మే 9 (ప్రజాక్షేత్రం):** మాక్లూర్ మండల పరిధిలోని ముబారక్ నగర్ గ్రామంలో జీసస్ లవ్స్ గొస్పెల్ చర్చ్ లో 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దైవజనులు విలియం కేర్ పాల్గొని ప్రత్యేక బైబిల్ వాక్య సందేశం అందించారు.

పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడుజీసస్ లవ్స్ గొస్పెల్ చర్చి సంఘ కాపరి డా.ఆనంద్ దైవజనురాలు స్తోత్రరాణి ,ఆయా గ్రామాల పాస్టర్లు పాల్గొని భక్తులకు ప్రత్యేక వాక్య సందేశాన్ని విశ్లేషించారు. విలియం కేర్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ... మందిరాన్ని బలపరిచి వార్షికోత్సవ కార్యక్రమాలను చేయడం జరుగుతుందని ఈ మందిరాన్ని నిర్మించడం వలన ఎంతోమంది దేవుడు బిడ్డలు బలపడ్డారని, శారీరక,మానసిక అనారోగ్యాల నుండి విడుదల పొందారని అన్నారు.అలాగే ప్రత్యేక పాటలు పాడుతూ.. ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఆయా గ్రామాల పాస్టర్లు,భక్తులు,యవ్వనులు, చిన్నలు, పెద్దలు పాల్గొన్నారు.








## తహసీల్దార్ కార్యాలయం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.

- గొల్లపల్లి లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలన.
- భూ భారతి భూ సమస్యలనుత్వరిత గతిన పరిష్కరించాలి.
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**కొండాపూర్,మే 09 (ప్రజాక్షేత్రం):**జిల్లా భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో భాగంగా శుక్రవారం జిల్లా కొండాపూర్ మండలం, గొల్లపల్లి, గ్రామం లో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ క్రాంతి వల్లూరుపాల్గొన్నారు.సదస్సుకు హాజరైన రైతులతో భేటీ అయ్యి, వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు సూచనలు చేశారు. రైతు లు సమర్పించిన దరఖాస్తులో భూ సమస్యలను పేర్కొనే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆన్లైన్ లో జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని అన్నారు.వివరాల నమోదులో తప్పిదాలకు ఆస్కారం కల్పించకూడదని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు హితవు పలికారు. దరఖాస్తుల పరిశీలన ఆన్లైన్ నమోదు ప్రక్రియలపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు.భూ రికార్డులలోని వివరాలను పక్కాగా సేకరిస్తూ, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం 18 రాష్ట్రాలలో సమగ్ర అధ్యయనం జరిపి, నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం అమలులోకి తెచ్చిందని అన్నారు.ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన కొండాపూర్ మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్ణీత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.భూ రికార్డులలో పేరు తప్పుగా ఉండడం, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావంలో మార్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి చట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనిర్దేశం చేశామని కలెక్టర్ తెలిపారు.పైలట్ ప్రాజెక్టు కింద కొండాపూర్ మండలంలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన మీదట, జిల్లాలోని మిగితా మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.అంతకుముందు కొండాపూర్ మండలం తహసీల్దార్ కార్యాలయం

## శ్రామిక శక్తి అవార్డు అందుకున్న నాయకులకు సన్మానం చేసిన ఐఎన్టీయుసి నాయకులు

**నారాయణపురం,మే 09 (ప్రజాక్షేత్రం):**యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రామిక శక్తి వార్డు పొందిన ఐఎన్టీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ లింగస్వామి కి ఎస్కే బడే సాబ్ కి శాలువతో సన్మానం చేసిన ఐఎన్టీయూసీ మండల అధ్యక్షులు దొల్ల గణేష్.ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఐఎన్టీయూసీ బలోపేతానికి ఏంతగానో కృషి చేసిన బడే సాబ్, లింగస్వామి కి దక్కిన అరుదైన గౌరవం ఈ శ్రామిక శక్తి అవార్డు అని కొన్ని సంవత్సరాల నుంచి ప్రతిపక్షంలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ ఐఎన్టియుసి బలోపేతానికి మరియు కార్మికులకు హక్కుల కోసం పోరాడుతూ అనేక ఉద్యమాలు పోరాటాలు చేశారని వారు తెలిపారు. నారాయణపురం మండల కేంద్రంలో ఐఎన్టియుసి జెండాను నిలిపిన ఘనత వారికే దక్కుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి అక్బర్ అలీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏపూరి సతీష్ ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శేఖర్ యాదవ్,రాజీవ్ గాంధీ భవన్ నిర్మాణ కార్మిక సంగం మండల అధ్యక్షుడు పులమోని శంకర్, దుర్గం గాలయ్య,స్వామి, యాదగిరి పాల్గొన్నారు.



## సర్వేల్ గ్రామ పంచాయతీ పరిధిలో నూతన బూత్ కమిటీల ఎన్నిక

**నారాయణపురం మే 9(ప్రజాక్షేత్రం):**సంస్థాన్ నారాయణపూర్ మండల పరిధిలోని సర్వేల్ గ్రామపంచాయతీ పరిధిలోగల 5 బూత్ లకు బీజేపీ మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ ఆధ్వర్యంలో నూతన బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో 83వ బూత్ అధ్యక్షులుగా కట్టెల మల్లేష్ గారిని,84వ బూత్ అధ్యక్షులుగా బూస ఆంజనేయులు గుప్త గారిని, 86వ బూత్ అధ్యక్షులుగా కేసాని జైపాల్ యాదవ్ గారిని,87వ బూత్ అధ్యక్షులుగా పసుల రాజుగౌడ్ గారిని 88వ బూత్ అధ్యక్షులుగా ఎల్లంకి యాదగిరి గౌడ్ గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కాగా 85వ బూత్ అధ్యక్షులుగా కట్కూరి లింగస్వామి గౌడ్ గారిని ఇదివరకే ఎన్నుకోవడం జరిగింది తధనంతరం నూతనంగా ఎన్నుకోబడిన బూత్ అధ్యక్షులను బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నకోబడిన బూత్ అధ్యక్షులు మాట్లాడుతూ మా బూత్ లలో భారతీయ జనతాపి పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర నర్సింహా గౌడ్, బండమీది కిరణ్ ముదిరాజ్, గుండె మల్లేష్ యాదవ్, బూస శ్రీనివాస్ గుప్త, వీరమళ్ళ నర్సింహా గౌడ్, బాలగోని యాదయ్య గౌడ్, ఎల్లంకి శ్రీనివాస్ గౌడ్,గుండె జంగయ్య యాదవ్ ఎల్లంకి శ్రీకాంత్ గౌడ్ మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# గంట్లకు విశ్వ దాత పురస్కారం ప్రధానము

- ఆదర్శనీయం..కాశీ నాధుని నాగేశ్వరరావు పంతులు దాతృత్వం
- కృష్ణ యూనివర్సిటీ వీసీ కూన రాంజీ,
- పామర్రు ఎమ్మెల్యే కుమారరాజా

**విశాఖపట్నం, మే 09(ప్రజాక్షేత్రం):**

దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు దాతృత్వం, త్యాగం, దేశభక్తి నేటి తరానికి ఆదర్శనీయమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కూన రాంజీ అన్నారు. కృష్ణా జిల్లా పామర్రు మండలం, ఎలకుర్రులో విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ స్థాయి విశ్వదాత అవార్డును విశాఖపట్నంకు చెందిన సీనియర్ పాత్రికేయులు, జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు కు వీసీ రాంజీ, పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార రాజాలు చేతులు మీదుగా ప్రధానము చేసారు. వేద మంత్రాల నడుమ ఘనంగా సత్కరించి విశ్వ దాత అవార్డును, నగదు ప్రోత్సాహం అందించారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా వీసీ కూన రాంజీ, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాలు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమకాలంలో కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గాంధీజీ అడుగు జాడలో నడిచారన్నారు. వందేళ్ల క్రింద శ్యామల పాఠశాల ఏర్పాటు చేసి అందరికి విద్య అందించారన్నారు.. అలాగే అమృతాంజన్ సృష్టికర్తగా, ఆంధ్ర పత్రిక వ్యవస్థాపకులుగా స్వాతంత్ర పోరాటం లో నాగేశ్వరరావు ఎంత గానో సేవలు అందించారని కొనియాడారు. సేవా గుణాన్ని పుణికిపుచ్చుకున్న వారి వంశీయులు నేడు మానసిక దివ్యాంగుల కోసం కేడీబీ ట్రస్టుని ఏర్పాటు చేసి ఉచితంగా విద్య, వైద్య సౌకర్యాలు అందించడంతో పాటు పలు వృత్తి విద్యాకోర్సుల్లో ఎంతో మందికి శిక్షణ ఇస్తున్నారని కొనియాడారు. అదే కుటుంబానికి చెందిన విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు కాశీ నాధుని నాగేశ్వరరావు మాట్లాడుతూ అంతటి మహోన్నత వ్యక్తి పేరిట ప్రతీ ఏటా విశ్వదాత అవార్డు అందిస్తున్నామన్నారు. ఈ అవార్డును ఇప్పటి వరకు ఎంతో మంది ప్రముఖులు కు అందించామని ఈ ఏడాది జర్నలిజం, సేవా రంగములో విశాఖపట్నం జిల్లా సింహాచలం గ్రామం కు చెందిన గంట్ల శ్రీను బాబు కు ఈ అవార్డు ను ప్రధానము చేయడం సంతోషం కలిగిస్తుంది అన్నారు.



అవార్డు స్వీకరించిన అనంతరం గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ కాశీ నాధుని నాగేశ్వరరావు పంతులు అవార్డు తాను స్వీకరించడం పూర్వ జన్మ సుకృతం గా భావిస్తున్నట్లు చెప్పారు..స్వాతంత్ర పోరాటములో గాంధీ తో కలిసి తన వంతు పాత్ర పోశించిన నాగేశ్వరరావు నేటి తరాలకు ఆదర్శనీయులు అన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయీ అవార్డు లు కంటే కాశీ నాధుని నాగేశ్వర రావు పంతులు పురస్కారం తనకు ఎంతో ప్రత్యేకమన్నారు..విద్యా, వైద్య రంగాల్లో ఎంతో పేరు ప్రతిష్ట పొందిన నాగేశ్వరరావు నేటి తరము కు ఆదర్శనీయులు అని కొనియాడారు..అంతకు ముందు కేడీబీ దివ్యాంగుల పాఠశాల, శ్యామల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆలరించాయి. విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ సభ్యులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీ నారాయణ వేదాంతం పార్ధ సారధి, ముది గొండ రవి కుమార్, శివ లెంక ఉషా కిరణ్, ఎం ఎన్ వి ప్రసాద్ లు గౌరవ అతిధులు గా హాజారయ్యారు. కార్యక్రమం సమన్వయకర్త గా ముదిగొండ శాస్త్రి తదితరులు అంతా కార్యక్రమం లో పాల్గొన్నారు..

## 8 వారాలు గడుస్తున్నా శారదాపీఠంపై చర్యలు ఏవి ?

- పెందుర్తి తహసీల్దార్ ను ప్రశ్నించిన తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్
- అంతకు ముందు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత,
- విశాఖలో టిడిపి నాయకులు వైసీపీకి, శారదా పీఠానికి కొమ్ముకాస్తున్నారు
- భీమిలిలో శారదా పీఠం భూముల ఫైల్ ను గతంలో అడ్డుకున్నారని పల్లా పై తెలుగు శక్తి ఆరోపణ
- ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారిస్తే 'అదృశ్య శక్తి ' ఎవరో తెలుస్తుందని వ్యాఖ్య
- వాస్తవాలను వెలికి తీసేందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని వినతి



**పెందుర్తి, మే 09(ప్రజాక్షేత్రం):**

ఆక్రమిత భూమిలో నిర్మాణాలు చేపట్టిన శారదాపీఠంపై 8 వారాలు గడిచినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్.. పెందుర్తి తహసిల్దార్ ఎం.ఆనంద్ కుమార్ ను ప్రశ్నించారు. అంతకు ముందు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే పంచకర్ల, మేయర్ పీలా శ్రీనివాస్ కు పరిస్థితిని బివి రామ్ వివరించారు. పెందుర్తి తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. పెందుర్తి లోని ఆక్రమిత భూములలో శారదా పీఠం అక్రమ నిర్మాణాలకు సంబంధించి తను పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే అన్నారు. ఈ క్రమంలోనే మార్చి 23వ తేదీన తహసిల్దార్ ఆనంద్ కుమార్ ను కలిసినప్పుడు.. శారదా పీఠం ప్రతినిధులు నాలుగు వారాల గడువు కోరారని, అందుకే పీఠంలోని అక్రమ నిర్మాణాలను కూల్చలేదని తహసిల్దార్ సమాధానం చెప్పారన్నారు. అయితే ఇప్పటికి ఎనిమిది వారాలు పైగా గడుస్తున్నా ఎందుకు శారదా పీఠం అక్రమ కట్టడాలు కూల్చలేదని ప్రశ్నించామన్నారు. అయితే ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళామని తహసీల్దార్ తెలియజేశారన్నారు. అయితే ఇదే విషయాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ వద్ద ప్రస్తావించగా.. అక్రమాలను ఎంత మాత్రం సహించేదిలేదని, అవసరమైన చర్యలు తప్పవని వారు తెలియజేశారన్నారు.

**ఆ అదృశ్య శక్తి ఎవరు?**

వైసిపి అరాచక పాలనలో విసిగి వేసారిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి అధికారం అప్పగించారన్నారు. అయితే విశాఖలోని కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు వైసిపి కి కొమ్ము కాయడంతో పాటు శారదా పీఠాని కి రక్షణ కవచంగా నిలుస్తున్నారన్నారు. అయితే ఆ అదృశ్య శక్తి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు, ఎంపీ శ్రీ భరత్, తెలుగు దేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు గండి బాబ్జి.. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు అయి ఉంటారని భావిస్తున్నామని బి.వి.రామ్ ఆరోపించారు. ఈ పరిస్థితులలో ప్రజలలో కూటమి ప్రభుత్వంపై విశ్వసనీయత పెరగాలంటే తక్షణమే వైసీపీ నాయకులకు, శారదా పీఠానికి రక్షణ కవచంగా మారిన అదృశ్య శక్తిని చంద్రబాబు నాయుడు గుర్తించి.. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలోనే వాస్తవాలను నీకు తెలిసినందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి రామ్ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా గతంలో భీమిలిలో శారదాపీఠానికి వైసీపీ ప్రభుత్వం కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవడంలో కీలకమైన ఫైల్ ని ముందుకు కదలకుండా పల్లా శ్రీనివాసరావు అడ్డుకున్నారని ఆరోపించారు. అయితే తెలుగు శక్తి రంగంలోకి దిగడంతో ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోగలిగిందన్నారు. పాత్రికేయుల కోసం శారదాపీఠం భూములు కేటాయించాలి. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములను ఎన్నో సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న పాత్రికేయులకు కేటాయించాలని బి.వి.రామ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిస్వార్ధంగా సమాజానికి ప్రభుత్వానికి మధ్య సేవలు చేస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వం స్థలాలను కేటాయించి ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాద వాశాత్తు వ్యక్తి మృతి.

**శంకర్ పల్లి మే 09(ప్రజాక్షేత్రం):** బుల్కాపూర్ గ్రామ శివారులో గల గూడెపు ఓడక కుంట లో (చెరువు) గడ్డం లక్ష్మయ్య (44) శుక్రవారం మధ్యాహ్నం అందాజ 12 గంటలకు శవంగా కనిపించడంతో, మృతుని భార్య గడ్డం జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్న పోలీసులు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు, తన భర్త నిన్న ఉదయం 10 గంటల నుండి కనపడటం లేదని, చుట్టు పక్కల వెతకగా శుక్రవారం ఇలా కనపడగా, తన భర్త కి మూర్ఛ లేదా ఫిట్స్ వస్తాయని, చేపల కోసం చెరువులోకి వెళ్ళగానే ఫిట్స్ వచ్చినట్లుగా కనపడుతుందని, గతంలో కూడా తన భర్త కి 45 సార్లు ఫిట్స్ వచ్చి కింద పడిపోయాడని తెలిపింది. మృత



దేహాన్ని పోస్ట్ మార్టం చేసి కుటుంబ సభ్యులకు ఇచ్చి విచారణ చేస్తున్నామని శంకర్ పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## ఉగ్రవాదానికి సరైన జవాబు ఇచ్చే హక్కును భారత్ వినియోగించుకున్నది

- భారత సరిహద్దులను, పౌరులను టచ్ చేసే ఉగ్రవాదాన్ని సహించబోమని ప్రపంచానికి తెలియజేసిన భారత్
- భారత సైనికులకు కృతజ్ఞతలు తెలిపిన ఎన్ హెచ్ ఆర్ సి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మారెళ్లి విజయ్ కుమార్



**కొత్తగూడెం టౌన్ మే 09(ప్రజాక్షేత్రం):**

విజయవంతంగా "ఆపరేషన్ సింధూర్" అమలుచేసి శత్రు స్థావరాలను విచ్చిన్నం చేసినందుకు భారత ప్రధాని మోదీకి, సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మారెళ్లి విజయ్ కుమార్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ పరేషాన్ అవుతుందని, ఉగ్రవాదాన్ని పెంచి పోషించే ఏ దేశానికైనా ఇది గుణపాఠం కావాలని అని ఆయన అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన భారతీయులకు ఈ సంఘటన ద్వారా నిజమైన నివాళులర్పించినట్లు అయిందని ఆయన అన్నారు. అనుకున్నట్లే ఉగ్రవాద మూకలకు గుణపాఠం చెప్పినందుకు అభినందనలు తెలిపారు. భారత సైన్యాన్ని చూస్తుంటే చాలా గర్వంగా ఉందని, వారికి ఇంకా మరింత శక్తి సామర్థ్యాలు భగవంతుడు కల్పించాలని ఆయన ఆకాంక్షించారు. ఇదే సందర్భంలో యుద్ధభూమిలో ఒలికిన మురళీనాయక్ రక్తం... భరతమాత నుదిటన అద్దిన సింధూరంతీ.దాయాది దేశం పాకిస్తాన్తో జరుగుతున్న యుద్ధంలో భారత ఆర్మీ జవాన్, తెలుగుతల్లి ముద్దుబిడ్డ, సత్యసాయి జిల్లా, గోరంట్ల మండలం, కల్లితండా గ్రామానికి చెందిన మురళీ నాయక్ వీరమరణం పొందడం బాధాకరం.. భరతమాత ఒడిలో, యుద్ధం చేస్తూ ఒరిగిన ఈ తెలుగు సైనికుడికి నా జోహార్లు నివాళులర్పించారు. భారతీయులు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

## గురునాథ్ పల్లిలో సమ్మర్ ఆల్వేన్ స్ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలి

**సిర్పంగి స్వామి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి**

**వలిగొండ మే 09(ప్రజాక్షేత్రం):** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేసవికాలంలో ఏప్రిల్ మే నెలలో కూలీలు చేసిన కూలికి అదనంగా 30% వేతనం కలుపుతూ చెల్లించే సమ్మర్ ఆల్వేన్స్ మూడు సంవత్సరాలుగా నిలిపివేయడం జరిగిందని తక్షణమే సమ్మర్ ఆల్వేన్స్ పథకాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగిస్వామి డిమాండ్ చేశారు, శుక్రవారం రోజున వలిగొండ గుర్నాథ్ పల్లి గ్రామములో ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశంలో నిర్వహించిన వారు మాట్లాడుతూ ,ఎర్రటి ఎండలో పనిచేసే కూలీలకు అదనంగా రావలసిన కూలీ డబ్బులు రాకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని అన్నారు, ప్రభుత్వం వెంటనే ఈ పథకాన్ని తిరిగి పునరుద్ధరణ చేయాలని, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని అన్నారు, ఈ నెల 20వ తేదీన ఉపాధి హామీ చట్టం రక్షణకై జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు తోట భాస్కర్ ,మండల నాయకులు తోట అమరేందర్, పాపయ్య, జక్క యాదయ్య, దొడ్డి స్వామి, ఏనుగుల శ్రీశైలం, తోట నవీన్, తదితరులు పాల్గొన్నారు.



# సీనియర్ జర్నలిస్ట్ డా.నేమాలకు మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ స్మారక పురస్కారం

**ఈ నెల 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అతిథులచే ప్రధానం**



**విశాఖపట్నం, మే 09(ప్రజాక్షేత్రం):** నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్,ఉత్తరాంధ్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. నేమాల హేమసుందర్ కు మరొక అరుదైన గౌరవం లభించింది. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీజేయు) సంస్థ స్థాపించి ఐదు వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో వివిధ రంగాలలో ప్రతిభ చూపిన వ్యక్తులను గుర్తించి వారికి భారత మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ స్మారక పురస్కారంతో సత్కరించనున్నారు. దీనిలో భాగంగా పాత్రికేయునిగా గత 30 ఏళ్లుగా నిస్వార్థ సేవలు అందిస్తున్న డా.నేమాలను భారత మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ అవార్డుకు కమిటీ వారు ఎంపిక చేశారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏపీజేయు ఇతర సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జ్ఞాని జైల్ సింగ్ స్మారక పురస్కారాన్ని ఆయన మనుమడు ఇంద్రజిత్ సింగ్ ఇతర అతిథులచే హేమసుందర్ అందుకోనున్నారు.



# దోమల నివారణ పాల్గొన్న పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు

**ఏలూరు జిల్లా మే 09 (ప్రజాక్షేత్రం):** శాసన సభ్యులు చిర్రి బాలరాజు బర్రింకలపాడు గ్రామంలో శుక్రవారం శుక్రవారం జరిగేటటువంటి దోమల నివారణ(శానిటేషన్) కార్యక్రమంలో పాల్గొనటం జరిగింది. ఈ శానిటేషన్ ప్రతీ గ్రామంలో తప్పనిసరిగా జరగాలని హెల్త్ డిపార్ట్మెంట్ వారిని ఆదేశించటం జరిగింది.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేసిన ఎమ్మెల్యే

**వలిగొండ మే 09(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెల్వర్తి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి అకస్మాత్తుగా తనిఖీ చేశారు, ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ధాన్యం కనుగోలను వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు, లారీల కొరత లేకుండా చూడాలి అన్నారు. వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ధాన్యం కనుగోళ్ళంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు,



# మానవత్వానికి మారు పేరు గురిజాల గ్రామం.

**ఊరంతా కలిసి పేషెంట్ కు 1 లక్ష 11 వేల 755 రూపాయల సాయమందించారు.**

**గురిజాల మే 09(ప్రజాక్షేత్రం):** హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ లో ప్రాణాపాయ స్థితిలో అపస్మారక స్థితిలో కొట్టు మిట్టాడుతున్న నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన అవివాహితుడు చిన్నపెల్లి అజయ్ 23 మెరుగైన వైద్య చికిత్స కోసం గురిజాల గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి గొలనకొండ వేణు 138 మందిని నుండి వాట్సప్ గ్రూప్ ల ద్వారా విరాళాలు సేకరించి 1 లక్ష 11 వేల 755 రూపాయలను వీరబోయిన కృష్ణ, ఆముదాల సతీష్, ఎండీ. అక్బర్, బత్తిని ప్రశాంత్ తదితరులతో వేణు నగదు మొత్తాన్ని అందజేశారు.

## భారత సైన్యానికి సంఘీభావం తెలిపిన ఆర్.జగదీశ్వర్ రెడ్డి వెల్టూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు



**పెద్దమండడి మే 09(ప్రజాక్షేత్రం):** ప్రపంచ శాంతికి విఘాతంగా మారిన ఉగ్రవాదాన్ని కూకట వేళ్ళతో పెకిలించడమే భారత్ లక్ష్యం అని, వెలటూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఆర్.జగదీశ్వర్ రెడ్డి (బంగ్లా బాబు) అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారత సైన్యం సింధూర్ పేరిట పాకిస్తాన్, పిఓకే ప్రాంతంలోని ఉగ్రవాద శిబిరాలపై జరిపిన ప్రతీకార దాడిని స్వాగతి చేస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. భారత సైనికులు చూపిన ధైర్యం,దేశంలోని ప్రతి పౌరుడికి గర్వకారణంగా ఉందని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దాన్ని రాజకీయాలకు అతీతంగా ప్రతిఘటించాలని, పెహల్గాం పై దాడికి పాకిస్తాన్ కు భారత సైన్యం సరైన సమాధానం చెప్పిందన్నారు. ఉగ్రముకలపై రుద్రతాండం చేయడంతో భారత్ సత్తా మరోసారి నిరూపణ జరిగిందన్నారు. పాకిస్తాన్ లోని ప్రజలకు ఎటువంటి హాని జరగకుండా కేవలం ఉగ్రవాదులను లక్ష్యంగా దాడులు చేశారని హర్షం వ్యక్తం చేశారు. దేశమంతా ఏకతాటిపై నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. భారత్ సైన్యం నిర్వహించిన ఆపరేషన్ ను కేంద్ర మంత్రివర్గం తో పాటు, యావత్ భారత్ జాతి గుర్తు చేశారు. పహాల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ లోని ఉగ్ర స్తావారాలపై సైన్యం మెరుపు దాడులు నిర్వహించడం ద్వారా భారత్ గట్టి హెచ్చరికలు జారీ చేసిందని అభిప్రాయపడ్డారు. దేశ ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, భారత సైన్యం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశ రక్షణకోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వవలసిన అవసరం ఉందని ఆర్. జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

# కామ్రేడ్ బి ఎన్ త్యాగాలు ఆదర్శాలు ఎంతో స్ఫూర్తిదాయకం

- ఎంసిపిఐ యు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్
- వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అగ్రగణ్యులలో కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి 17వ వర్ధంతి...



**నర్సంపేట మే 09(ప్రజాక్షేత్రం):** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ భీం రెడ్డి నర్సింహా రెడ్డి ఆదర్శాలు త్యాగాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం, అనుసరణీయమని యంసిపిఐ యు వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. శుక్రవారం రోజు అమరజీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి గారి 17వ వర్ధంతి సందర్భంగా నర్సంపేట లోని ఓంకార్భవన్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నినాదాలు చేస్తూ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కామ్రేడ్ బియన్ విద్యార్థి దశలో తన గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో నాటి దొరల ఆగడాలు, నైజాం రజాకార్ల దౌర్జన్యాలు చూసి సహించలేక నాటి ఆంధ్రమహా సభ కార్యక్రమాలకు ఆకర్షితులై క్రమక్రమంగా వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించిన ఆరుగురు అగ్రగణ్యులలో ఒకరై యావత్ తెలంగాణ సమాజానికి తెలంగాణ క్యాస్ట్రోగా మారినారని, నాటి నైజాం, దొరలు, భూస్వాములు సాగిస్తున్న వెట్టిచాకిరి కి, ఆర్థిక దోపిడీ కి వ్యతిరేకంగా ప్రజలందరినీ చైతన్యం చేసి సాయుధులుగా మలచడంలో, తుపాకీ కాల్చడంలో, దొరలను గడగడలాడించి, ఊదర బాంబుల ద్వారా దొర పీచాలను అణిచి వేసి, ఎక్కడ అరాచకం ఉంటే అక్కడ ప్రత్యక్షమై వెట్టి మనుషులు, మట్టి మనుషులను పోరాట యోధులుగా తీర్చిదిద్దిన అగ్రశ్రేణి నేత కామ్రేడ్ బియన్ గారని, పది లక్షల ఎకరాల భూ పంపిణీలో, మూడు వేల గ్రామ రాజ్యాల నిర్మాణంలో ప్రముఖ పాత్ర కామ్రేడ్ బియన్ గారిది అన్నారు. సాయుధ పోరాట సమయంలో మొదట ఆయుధం చేపట్టి విరమణ సమయంలో చివరికి ఆయుధం ఒదిలిన నేత కామ్రేడ్ బి యన్ గారేనని ప్రపంచ విప్లవోద్యమంలో చేగువేరా చెరుగని ముద్ర వేసినట్లుగా తెలంగాణ సాయుధ పోరాటం లోను, పోరాట విరమణ తరువాత సాగిన మహత్తర విప్లవ ఉద్యమాల్లో చెరుగని ముద్ర కామ్రేడ్ బి ఎన్ ని అలాగే ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో గాని సిపిఎం పార్టీలో గాని ప్రజల కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిస్తూ అనేక ప్రజా విజయాలు ప్రజలకు సాధించి పెట్టిన కామ్రేడ్ బి యన్ 2 సార్లు యంయల్ఎ గా, మూడు సార్లు యంపి గా గెలుపొందిన తీరు చట్ట సభల్లో పీడిత ప్రజా పక్షాన జరిపిన పోరాటం పార్లమెంటు వెలుపల నిర్మించిన అనేక ప్రజా ఉద్యమాలకు కామ్రేడ్ బి యన్ నేతృత్వం వహించిన తీరు నేటి తరానికి ఆదర్శం అని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం సామాజిక సమస్యను అణిచివేత ను గుర్తించటం లో వైఫల్యం కారణంగా అనేక ప్రజా ఉద్యమాలు బలహీన పడినాయని అందుకు సామాజిక న్యాయం కోసం త్యాగం చేయాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ బి ఎన్ యంసిపిఐ యు పోలిట్బ్యూరో సభ్యులుగా అఖిలభారత రైతు నేత గా సూర్యాపేట ప్రాంతానికి గోదావరి జలాలు సాధించాలని ప్రజా ఉద్యమం నిర్మించి నాటి ముఖ్యమంత్రి చే తిరుమలగిరి లో శ్రీ రాం సాగర్ 2 వ దశ కు శంకుస్థాపన చేసి గోదావరి జలాలను సాధించారని, నల్గొండలో యూనివర్సిటీ, బీబీనగర్ నుంచి నడికుడ రైల్వే లైన్ సాధన పోరాటంలో ప్రముఖ పాత్ర నిర్వహించారని ఇలాంటి త్యాగధనుల చరిత్ర భవిష్యత్ తరాలకు అందించటానికి నేటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి కామ్రేడ్ బి యన్ కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని, నల్గొండ యూనివర్సిటీకి, యస్ ఆర్ యస్ పి రెండో దశకు బి యన్ పెట్టడం ద్వారా తెలంగాణ పోరాట వారసత్వాన్ని గౌరవించిన వారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, కుసుంభ బాబురావు, డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్,పట్టణ నాయకులు బైరబోయిన నరసయ్య,గోనేల రతన్, శివ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# చింతలపూడి పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

**జిల్లా ఎస్పీ శ్రీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వారు తనిఖీ నిర్వహించినారు**

**ఏలూరు జిల్లా మే 09(ప్రజాక్షేత్రం):** ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ శుక్రవారం అనగా చింతలపూడి పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలలో భాగంగా స్టేషన్ను పరిశీలించారు. ఈ సందర్భంగా చింతలపూడి పోలీస్ సిబ్బంది జిల్లా ఎస్పీ గారికి గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు "స్వచ్ఛంద ఆంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. స్టేషన్లో నిర్వహిస్తున్న అన్ని రికార్డులను సమీక్షించి, పరిపాలనా విధానాలను మెరుగుపరిచేలా మార్గదర్శకాలు అందించారు. మండల పరిధిలోని ప్రతి గ్రామ సమస్యలను అధికారుల ద్వారా వివరంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చిన్న సమస్యలు తలెత్తిన వెంటనే అధికారులే పరిష్కారం చేసేందుకు ముందడుగు వేస్తే, భవిష్యత్తులో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉంటుంది అని స్పష్టం చేశారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాల పర్యవేక్షణ ద్వారా నేరాలను గుర్తించి, ట్రాఫిక్ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలి. హైస్కూల్, కాలేజీలు, రద్దీ ప్రదేశాలలో "శక్తి యాప్" పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. మహిళలు & బాలికలు ఈ యాప్ ఉపయోగించడం ద్వారా సురక్షితంగా ఉండేలా వారిలో విశ్వాసం పెంపొందించాలి. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకొని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలి. అధికారులు సమిష్టిగా పనిచేస్తూ రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. డ్రోన్ పర్యవేక్షణ ద్వారా ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రజలకు సీసీటీవీల వినియోగంపై అవగాహన కల్పించి, స్టేషన్ల పరిధిలోని వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, రహదారులు, ప్రజా ప్రదేశాల్లో సీసీటీవీ ఏర్పాటు చేయడం వల్ల దర్యాప్తుకు ఎంతగా ఉపయోగపడుతుందో తెలియజేయాలి. ఈ తనిఖీ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు అందించి, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారం అంశాల్లో మరింత ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ సింధూరం పురస్కరించుకుని ఎటువంటి అసత్య ప్రచారాలు, కాకుండా చూడాలని, అన్ని ప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలన చేయాలని కొత్త వ్యక్తుల కథలు పై నిఘా ఉంచాలని వాట్సప్ ద్వారా జరిగే ప్రచారాలపై ఏదైనా అనుమానాస్పద ప్రచారాలు జరిగితే వాటిపై వాటి యొక్క అడ్మిన్లపై కూడా చర్యలు తీసుకుంటామని ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైన సమయంలో ప్రజలు వారి యొక్క ప్రాణాన్ని ఎలా సంరక్షించుకోవాలనే విషయాలపై మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, జంగారెడ్డిగూడెం డిఎస్పి యు రవిచంద్ర చింతలపూడి ఇన్స్పెక్టర్ సిహెచ్ రాజశేఖర్ చింతలపూడి ఎస్సై కుటుంబరావు మరియు పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతలపూడి పట్టణంలో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె ప్రతాప్ సింగ్ ఐపీఎస్ వారు ఈ మెగా రక్తదాన శిబిరంలో ప్రజలు చాలా ఉత్సాహంగా పాల్గొని వారి యొక్క రక్తాన్ని దానం చేసిన దానిపై ప్రజలను అభినందించిన జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో మేలని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వలన ఆపద సమయంలో ఉన్నటువంటి ప్రజలకు పునర్జన్మ ప్రసాదించిన వారు అవుతారని ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని ప్రోత్సహించాలని తలసేమియా వ్యాధిగ్రస్తులు నిత్యం వారి యొక్క రక్తం తగ్గిపోవడం వలన మీరిచ్చే రక్తమే వారికి ప్రాణాలను నిలబడదని గ్రహించాలని తెలియజేసిన జిల్లా ఎస్పీ.

# సమాజంలో వైద్య విద్యకు మంచి భవిష్యత్తు

- పేద రోగులకు సేవలు అందిస్తేనే గౌరవం గుర్తింపు
- రోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైద్య సేవలు అందించాలి
- ప్రపంచంలో మరణం లేనిది విద్యా, వైద్యం మాత్రమే
- కేఎన్ఆర్ యుహెచ్ఎస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి

**గజ్వేల్ టౌన్మే 09(ప్రజాక్షేత్రం):**

సమాజంలో అత్యంత ఆధరణ కలిగినది వైద్య విద్యకు మంచి భవిష్యత్తు ఉండగా ప్రపంచంలో మరణం లేనిది విద్యా వైద్యం మాత్రమేనని కేఎన్ఆర్ యుహెచ్ఎస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ములుగు మండలం లక్ష్మక్క పల్లి ఆర్వీఎం మెడికల్ కళాశాలలో చైర్మన్ డాక్టర్ యాకయ్య అధ్యక్షతన జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో గ్రామీణ పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా రోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చక్కటి సేవలందిస్తే సమాజంలో గౌరవం గుర్తింపు దక్కుతుందని పేర్కొన్నారు. ఉన్నత లక్ష్యంతో పనిచేస్తున్న ఆర్వీఎం ట్రస్టు నయా పైసా ఆశించకుండా ప్రజా వైద్యశాలగా గుర్తింపు తెచ్చుకుంటూ కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు ప్రశంసించారు. అదేవిధంగా వైద్య విద్య గ్రాడ్యుయేషన్ తో ముగియదని స్పష్టం చేస్తూ నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పరిశోధన, ఉత్తమ పద్ధతి పురోగతితో జ్ఞానం నైపుణ్యత పెంచుకోవడానికి దోహదపడుతుందని అన్నారు. నిరంతరం వినూత్న విధానాలు, వ్యూహాలను అన్వేషిస్తూ సవాళ్లను అధిగమించడం పై దృష్టి పెట్టాలని తద్వారా చక్కటి ఫలితాన్ని సాధిస్తారని తెలిపారు. నిరంతర విద్యార్థిగా గ్రాడ్యుయేట్ వైద్యులు భావిస్తూ ఆరోగ్య నిపుణుల సలహాలు స్వీకరించాలని ఆకాంక్షించారు. సాంప్రదాయ పద్ధతులు ఆధునిక అభ్యసన విధానాలపై వైద్య విద్య ఆధారపడి ఉండగా మెరికల్లాంటి శిక్షకులు చక్కటి వసతులు బోధన నైపుణ్యత కలిగిన ఆర్వీఎం మెడికల్ కళాశాల అగ్రశ్రేణి వైద్యులుగా తీర్చిదిద్దుతున్న ఘనత దక్కించుకుంటున్నట్లు తెలిపారు . వైద్య విద్యార్థులు సురక్షిత నియంత్రిత వాతావరణంలో క్లినికల్ నైపుణ్యత సాధించాలని ఆకాంక్షించారు. వైద్య విద్య, నాణ్యత సామర్థ్య ఆధారిత విధానంపై ఆర్వీఎం దృష్టి సారించి ఆనతి కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నట్లు తెలిపారు. వైద్య విద్య ప్రమాణాలు, బోధన పద్ధతులు నిష్ణాతులైన నిపుణులతో కూడిన మెడికల్ కళాశాలలు నెలకొన్న పోటీ తత్వంలో దూసుకెళ్తాయని, తల్లిదండ్రులు వాటిని గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. అదేవిధంగా తమ పిల్లలు డాక్టర్లు కావాలో మంచి డాక్టర్లుగా గుర్తింపు పొందాలో తల్లిదండ్రులు ఎంచుకోవాలని కోరారు. సమాజ భవిష్యత్తును నిర్దేశిస్తున్న వైద్య విద్యతో ఆరోగ్యకర వాతావరణ నెలకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి సీఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ సింధూరు సంఘీభావంగా బైక్ ర్యాలీ

**ప్రజాక్షేత్రం, తెలంగాణ బ్యూరో:** ఆపరేషన్‌సింధూర్ కు సంఘీభావంగా హిందూ జాగృతి ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు .భారతదేశంలో పాకిస్తాన్ కు మధ్యల జరుగుతున్న యుద్ధానికి నిరసనగా సిద్ధిపేటలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో కార్మికులు కర్షకులు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు పాత్రికేయ మిత్రులు పోలీస్ శాఖ వారు కూడా సహకరించారు సైనికులు చేస్తున్నటువంటి యుద్ధానికి మద్దతుగా సిద్ధిపేట వ్యాపారలు ప్రతినిధులు పాల్గొని రాలిని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికిపేరుపేరునా ధన్యావాదాలు తెలిపారు.







# అగ్గికి ఆహుతైన పశుగ్రాసం

**ప్రజాక్షేత్రం నంగునూరు, మే 9:**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో ప్రమాదవశాత్తు పశు గ్రాసం దగ్ధమైంది. సిద్ధన్నపేట గ్రామానికి చెందిన బంక మహిపాల్ అనే రైతు ఇటీవల మూడు ఎకరాలలో వరి కోశారు. ట్రాక్టర్ తో గడ్డిని మోపులు చుట్టించారు. చుట్టించిన గడ్డిని 300 మోపులుగా చుట్టి వ్యవసాయ క్షేత్రంలో గడ్డివామి పెట్టాడు. తాను పెంచు కుంటున్న అయిదు పాడి గేదెలకు పశు గ్రాసం కోసం నిల్వ చేశాడు. శుక్రవారం వ్యవసాయ క్షేత్రంలో పనులు ముగించుకుని మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇంటికి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గడ్డికి నిప్పు అంటుకుని దగ్ధం అయ్యింది. మంటలను గమనించిన చుట్టుపక్కల వ్యవసాయ క్షేత్రాలకు చెందిన రైతులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తూనే, మహిపాల్ కు ఫోన్లో సమాచారం అందించారు. వెంటనే వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న మహిపాల్ అక్కడి రైతుల సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు ఆరకపోవడంతో వ్యవసాయ బావుల విద్యుత్ మోటార్లు ఆన్ చేసి పక్క వ్యవసాయ క్షేత్రాలకు మంటలు విస్తరించకుండా ఆర్పివేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది. గడ్డి పూర్తిగా కాలిపోవడంతో పాడి పశువులకు పశుగ్రాసం ఇబ్బందిగా మారిందని రైతు మహిపాల్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ఘనంగా పూర్ణాహుతి కార్యక్రమం

**ప్రజాక్షేత్రం నంగునూరు, మే 9:**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలోని శ్రీ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శనివారం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాళ్ల బండి రమణాచారి, నాయిని రవీందర్ రెడ్డి, నార్లపురం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పుప్పాల నారాయణ తదితరుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగా స్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



# అలాజ్ పూర్ కిషన్ కు వేముగంటి సాహితీ పురస్కార ప్రదానం

**ప్రజాక్షేత్రం సిద్దిపేట మే 9**

సిద్దిపేట కు చెందిన ప్రముఖ వచన కవి అలాజ్ పూర్ కిషన్ కు వేముగంటి సాహితీ పురస్కారాన్ని అందజేశారు.గత 35 ఏండ్లు గా సామాజిక దృక్పథం తో కవిత్వం రాస్తున్న అలాజ్ పూర్ కిషన్ "వడిసెల" "పేగుతెగిన పాట" కవితా సంపుటాలను వెలువరించారు. నిజాయితీగా, నిబద్ధగతతో ప్రజల పక్షాన నిలబడి సాహిత్య సృజన చేస్తున్న అలాజ్ పూర్ కిషన్ కు ప్రఖ్యాత పద్యకవి, కవి కోకిల, విద్వత్ కవి, సుకవిభూషణ బిరుదాంకి తులు శ్రీమాన్ వేముగంటి నరసింహా చార్యుల పేరిట ఏర్పాటుచేసిన సాహిత్య పురస్కారానికి వేముగంటి సాహిత్య పీఠం ఎంపిక చేసింది.ఈ మేరకు సాహిత్య పీఠం అధ్యక్షులు వేముగంటి రఘు నందన్ ఈ పురస్కారాన్ని అలాజ్ పూర్ కిషన్కు ఇవ్వాలని నిర్ణయించారు. మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన సాహిత్య సభలో అలాజ్ పూర్ కిషన్ కు వేముగంటి సాహితీ పురస్కారాన్ని పలువురు ప్రముఖ రచయితలు అందజేశారు.ప్రఖ్యాత రచయిత, సామాజిక విశ్లేషకులు, వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్. వేణుగోపాల్, ప్రఖ్యాత రచయిత, కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, ప్రఖ్యాత కవి, గాయకుడు, శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, టీఎన్జీవో సంఘం మాజీ మాజీ అధ్యక్షులు దేవి ప్రసాద్, మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కే రంగాచార్య ప్రధాన కార్యదర్శి సుద్దెంకి యాదగిరి, వేముగంటి సాహిత్య పీఠం అధ్యక్షులు వేముగంటి రఘు నందన్,దారం మల్లారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కే అంజయ్య, అలాజ్ పూర్ శ్రీనివాస్, ప్రముఖ కవి వేముగంటి మురళి, తోట తదితరులు తదితరులు అలాజ్ పూర్ కిషన్ కు వేముగంటి సాహిత్య పురస్కారాన్ని అందజేశారు..



# గ్రామపంచాయతీ కార్మికులు ఐదు నెలల నుంచి జీతాలు లేవు



**ప్రజాక్షేత్రం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి మే:09** బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముంపునకు గురైన మల్లన్న సాగర్ గ్రామాలను గజ్వేల్ పట్టణంలో ముంపు గ్రామాల వారికి నిర్మాణం చేశారు. కానీ గ్రామ పంచాయతీ కార్మికులు ఆర్ అండ్ ఆర్ కాలనీలో 32 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీళ్ళకు ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని గత 15 రోజులు నుండి చెత్త బండి తీయడం లేదు. గ్రామాలలో ఇండ్లలో తడి పొడి చెత్త ఎక్కడికక్కడే ఉండిపోవడం వల్ల గ్రామ ప్రజలు ఆందోళనలు చేస్తున్నారని లక్ష్మాపూర్ విలేజ్ కరెంట్ హెల్పర్ నాగరాజు చెప్పారు. మాకు జీతాలు పడడం లేదని జిల్లా కలెక్టర్ దగ్గరికి పోయి అడుగుతే వారం పది రోజులలో జీతాలు వచ్చేటట్టు చేస్తానని అన్నారు. మెల్లగా నెల రోజుల గడుస్తున్నా కానీ ఇంతవరకు కార్మికుల జీతాలు పడకపోవడంతో మళ్లీ జిల్లా కలెక్టర్ నీ కలవడం జరిగింది. కలెక్టర్ మంత్రి చెబితే చెపితే జీతాలు ఇ స్తా మ ని అన్నారు. ఏ అధికారులు కూడా మా బాధలు పట్టించుకోవడం లేదు. అప్పులు చేసుకొని పూట గ డు పు తు న్నా మని గ్రామ పంచాయతీ సిబ్బంది చెప్పారు. మా గ్రామాలను గ్రామపంచాయతీలుగా కొనసాగిస్తారా లేక మున్సిపాలిటీలో కలుపుతారా అని అయోమయంలో గ్రామ కార్మికులు ఉన్నారని తెలిపారు. వారికి జీతాలు మున్సిపాలిటీ వారు ఇస్తారా లేక గ్రామపంచాయతీ నుండి ఇస్తారా అని తెలియటం లేదని తెలిపారు. ఇకనైనా మా బాధలు చూసి ఎమ్మెల్యే అయినా మంత్రి అయినా పట్టించుకోని మాకు జీతాలు ఇప్పించాలని రాష్ట్ర





# సహజ ప్రసవాలు సంఖ్యను పెంచాలి

## గజ్వేల్ మాత శిశు ఆరోగ్య కేంద్రం ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి

**ప్రజాక్షేత్రం సిద్దిపేట మే 9**

మాత శిశు ఆరోగ్య కేంద్రం లో సహజ ప్రసవాలు సంఖ్యను పెంచుతూ గర్భవతులకు మెరుగైన సేవలు అందించాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అదేశించారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి డాక్టర్ లు అందిస్తున్న సేవలను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... ఈ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నెలకు 350 నుండి 400 వరకు ప్రసవాలు జరుగుతున్నట్టు ప్రసవాలలో సిజేరియన్ కాకుండా నార్మల్ డెలివరీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ పేషంట్లతో అన్యోన్యంగా డాక్టర్లు మెలగాలని తెలిపారు. ఈ హాస్పిటల్ వాతావరణం బాగుంది కాబట్టి పేషెంట్స్ కు ఇంకా మెరుగైన సేవలు అందించడానికి హాస్పిటల్ యాజమాన్యం కొన్ని సౌకర్యాలు కావాలని కోరాగా అందులో ముఖ్యంగా బ్లడ్ బ్యాంక్, పేషెంట్లు కూర్చోవడానికి బెంచీలు, టేబుల్స్, మరుగుదొడ్లు ఇతర పనులు అన్నింటిని పరిగణలోకి తీసుకుని సాంక్షన్ ఇచ్చి వేగంగా పనులు పూర్తి చేస్తాం అని తెలిపారు . అలాగే మేటర్నల్ ఐసీయూ సేవలు మెరుగుపరచడానికి ఒక అనస్థటిస్ ఉంటే బాగుంటుందని నివేదికను సైతం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి అనస్థటిస్ ఎక్కువ సంఖ్యలో ఉంటే మెరుగైన సేవలు అందించడానికి ఎంతో సులభంగా ఉంటుందని తెలిపారు.

**టీజీఐఐసి ల్యాండ్ ను పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్....**

జగదేవ్పూర్ మండలంలోని మునిగడప గ్రామ పరిధి లోనీ పలుగడ్డ శివారులో గల సుమారు 400 ఎకరాల టీజీఐఐసి ల్యాండ్ ను క్షేత్రస్థాయిలో జిల్లా



కలెక్టర్ పరిశీలించారు. ల్యాండ్ మ్యాప్ లో అందించాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. ల్యాండ్ చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.కలెక్టర్ వెంట ఆర్డీవో చంద్రకళ, డి సి హెచ్ ఓ అన్నపూర్ణ, తాసిల్దార్ ఇతర విభాగాల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.




# అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దు

- సౌజన్య, ప్రొబేషనరీ ఎస్సై, రాజగోపాలపేట.
- మహిళలు మౌనం వీడి ఫిర్యాదు చేయాలి

**ప్రజాక్షేత్రం నంగునూరు, మే 9:** అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మవద్దని రాజగోపాలపేట ప్రొబేషనరీ ఎస్సై సౌజన్య సూచించారు. రాజగోపాలపేట గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, అపరిచిత వ్యక్తుల మోసాలపై ప్రజలకు సిద్దిపేట షీటీమ్ ఆధ్వర్యంలోరాజగోపాలపేట ప్రొబేషనరీ ఎస్ఐ సౌజన్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఏదైనా ఇస్తామని చెప్తే నమ్మ వద్దన్నారు. కొన్ని డబ్బులు పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయని మోసం చేసేవారు ఉంటారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దు అని చెప్పారు. సామాజిక మాధ్యమానికి(సోషల్ మీడియాకు) దూరంగా ఉంటే భవిష్యత్ మంచిగా ఉంటుందన్నారు. ఏదైనా నేరం జరిగినప్పుడు మహిళలు మౌనం వీడి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియజేశారు. మహిళల భద్రత తమ బాధ్యత అని చెప్పారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని సూచించారు. సెల్ ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిదని, సెల్ ఫోన్ వల్ల మంచి ఎంత ఉందో చెడు అంతే ఉందని తెలిపారు. సెల్ ఫోన్ కు అలవాటు పడి బానిసలు కావద్దు చెప్పారు. పిల్లలను ఎండలో బయటకు పంప వద్దని కోరారు. పిల్లలను ఒంటరిగా ఈతకు పంపవద్దని తెలియజేశారు. రాత్రి సమయాలలో ఇంటికి తాళం వేసి ఇంటి ముందర గానీ, డాబాపై గానీ నిద్రించే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.మహిళలు వ్యవసాయ పనులపై ఒంటరిగా వెళ్లేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ఒంటరిగా వెళ్ళినప్పుడు మహిళల శరీరంపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఎవరైనా వేధింపులకు గురి చేసైనా, లేదా హేళనగా మాట్లాడినా వెంటనే డయల్ 100 కు గానీ, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీ టీమ్ నెంబర్ 8712667434 కు గానీ ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమాచార అందించిన వారి పేర్లు రహస్యంగా ఉంచుతామన్నారు. మహిళలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, షీ టీమ్ నిర్వహించే విధులు, షీ టీమ్ ద్వారా రక్షణ పొందే విధానం, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు వంటి నూతన చట్టాలు, సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో సిద్దిపేట షీ టీమ్ బృందం ఏఎస్ఐ కిషన్, మహిళ కానిస్టేబుల్ మమత, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



# 11న నరసింహ స్వామి జయంతి

**ప్రజాక్షేత్రం, సిద్దిపేట అర్బన్:**

పుల్లూరు బండ శ్రీ స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 11 ఆదివారం వైశాఖ శుద్ధ చదుర్థశి, స్వాతి నక్షత్రం రోజున మన పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో నరసింహ జయంతి ఉత్సవం జరుగుతుందని వంశపారం పర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్యులు శుక్రవారం తెలిపారు. 11న ప్రహల్లాదుని ప్రార్థన మేరకు స్థంభం నుండి స్వయంభూ గా ఉద్భవించిన రోజు అందులో భాగంగా ఉదయం స్వయంభూ స్వామికి పంచామృతాలతో అభిషేకం.. సుదర్శన నరసింహ హోమం.. ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. ఉత్సవం లో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొనాలని కోరారు.






# రామంచలో ముందస్తు బడిబాట

**తల్లిదండ్రులు తో ఉపాధ్యాయుల సమావేశం**

**ప్రజాక్షేత్రం చిన్నకోడూరు, ఏప్రిల్ 9:**

ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని రామంచ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా షరీఫ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే చేపట్టి విద్యార్థులను ముందస్తుగా నలుగురు విద్యార్థులను పాఠశాలలో నమోదు చేయడం జరిగింది. రామంచ బడిలో ఉన్నత అర్హతలు కలిగిన ఉపాధ్యాయ బృందం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా దుస్తులు, నాణ్యమైన మధ్యాహ్నం భోజనం, అంబలి అందిస్తున్నారని, విశాలమైన ఆట స్థలం, తరగతి గదులు ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల కు పెట్టే ఫీజుల డబ్బులు కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సద్గుణ చారి ఉపాధ్యాయులు సురేష్ కుమార్, వరప్రసాద్, యాదయ్య, లలిత, సునీత, వాణి, ప్రవీణ్ పంతులు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



# లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాక్షేత్రం సిద్దిపేట మే 9**తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ (తాలిమ్) నుండి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు.. తెలంగాణలోని అన్ని మీ సేవ కేంద్రాలలో లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో మొత్తం 50 పని దినాలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు అభ్యర్థులు ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండాలి) కనీసం 60% మార్కులు ఉండాలని, ఐటీఐ డ్రాఫ్ట్స్ మెన్ (సివిల్), డిప్లొమా (సివిల్),బి.టెక్ (సివిల్) ఇతర సమానమైన అర్హతలు ఉండాలన్నారు.

**దరఖాస్తు విధానం....**

దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్ను మే 5 నుండి 17 వరకు మీ సేవా కేంద్రాలద్వారా మాత్రమే రూ. 100/ చెల్లించి పొందవచ్చు అన్నారు. ఈనెల 17 వరకు దరఖాస్తులను సమర్పించాలన్నారు.

ఫీజు వివరాలు....

ఓసి అభ్యర్థులకు రూ.10,000/, బిసి అభ్యర్థులకు రూ.5,000/ ఎస్సీ & ఎస్టీ అభ్యర్థులకు రూ .2,500/చెల్లించాలన్నారు లైసెన్స్ కలిగిన సర్వేయర్లుగా మారేందుకు ఇదొక సువర్ణ అవకాశమని, అర్హత కలిగినటువంటి అభ్యర్థులు, తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ నుండి విడుదల అయినటువంటి ఈ నోటిఫికేషన్ను సద్వినియోగ పరుచుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



# అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మవద్దు

**ప్రజాక్షేత్రం కొమురవెల్లి మే 9**

ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అమాయక ప్రజలను చూసి ఇది ఇస్తాము అది ఇస్తాము కొన్ని డబ్బులు పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయి అని మోసం చేసేవారు ఉంటారు జాగ్రత్తగా ఉండాలి కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేచరేణి బీడీ కంపెనీ వద్ద ప్రజలకు మహిళలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, మరియు అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మరియు మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాద్యత. గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్కూల్ వెళ్లే పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని సూచించారు, సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దు సూచించారు. పిల్లలను వేసవికాలం అయినందున ఎటుపడితే అటు మరియు ఈతకు పంపవద్దని సూచించారు. రాత్రి సమయాలలో ఇంటికి తాళం వేసి ఇంటి ముందర లేదా డాబాపై పడుకునే అలవాటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళలు వ్యవసాయ పనులపై ఒంటరిగా వెళ్లేటప్పుడు వంటిపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉంటుంది జాగ్రత్త పడాలి మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ షీటీమ్ బృందం హెడ్ కానిస్టేబుల్ సదయ్య మహిళ కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత తదితరులు పాల్గొన్నారు.




## దేశ జవాన్ల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ నెల జీతం విరాళం

**తెలంగాణబ్యూరో ప్రజాక్షేత్రం**

ప్రస్తుత యుద్ధ సంక్షోభ నేపథ్యంలో, దేశ రక్షణ కోసం శ్రమిస్తున్న జవాన్ల పట్ల కృతజ్ఞతారూపంగా, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు తన నెల జీతాన్ని విరాళంగా ప్రకటించారు.దేశాన్ని కాపాడుతున్న సైనికుల కోసం నేను నా నెల జీతాన్ని అంకితం చేస్తున్నాను. ముఖ్యమంత్రి గారి స్ఫూర్తిదాయక నిర్ణయాన్ని అనుసరిస్తూ, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను గుర్తించాలి అని మంత్రి తెలిపారు



# మావోలతో కేంద్రం చర్చలు జరపాలి



**మంత్రి పొన్నం ప్రభాకర్**

**ప్రజాక్షేత్రం, సిద్దిపేట ప్రతినిధి:** ములుగు జిల్లా కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి మృతి చెందిన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పాల్వంచ కి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ పార్థివ దేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్,ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నివాళి అర్పించారు. గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. శ్రీధర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కానిస్టేబుల్ మృత దేహానికి కలెక్టర్,ఎస్పీ ఇతర ఉన్నతాధికారులు నివాళి అర్పించారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పాల్వంచ గ్రామానికి చెందిన వడ్ల శ్రీధర్ 2020 బ్యాచ్ కి చెందిన కానిస్టేబుల్ విధి నిర్వహణలో బాగంగా ములుగు జిల్లా కర్రెగుట్టల్లో పోరాటంలో మరణించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి సంఘీభావం తెలియజేస్తూ వారి కుటుంబం ధైర్యంగా ఉండడానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో క్రమ శిక్షణ తో పని చేస్తూ అక్కడ జరిగిన పోరాటంలో వడ్ల శ్రీధర్ ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి ఘటనలు సహించేది లేదు. హింసకు తావు ఉండదు.. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలు , మావోయిస్టులు చేస్తున్న కార్యక్రమాలు అయిన హింసకు తావు ఉండద్దు. హింసకు పాల్పడితే ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ఎవరు అంగీకరించరు. హింస కు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకం. మావోయిస్టులు సైతం శాంతి యుత చర్చలు అని ప్రకటించారు. కాల్పుల విరమణ ప్రకటించారు. ప్రాణనష్టం జరగకుండా శాంతి భద్రతలు కాపాడుకోవాలి. ముఖ్యమంత్రి పక్షాన తెలంగాణ ప్రభుత్వం పక్షాన శాంతియుతంగా ఉండాలని కోరాం. మాజీ మంత్రి జానారెడ్డి , కేశవరావు తో కేంద్ర ప్రభుత్వం తో మాట్లాడే ప్రయత్నం జరుగుతుంది. ఈ సంఘటన జరగడం దురదృష్టకరం. శాంతి భద్రతలు కాపాడడానికి చనిపోయిన వారికి కుటుంబ ప్రజా ప్రభుత్వం రూ. 2.17 కోట్లు పరిహారం,900 గజాల స్థలం,ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. హింసకు పాల్పడకుండా చర్చలకు దిగి.. రాష్ట్రంలో ప్రశాంతంగా ఉండేలా ముఖ్యమంత్రి కూడా ఈ అంశంపై చర్చించారు. ఆపరేషన్ కగర్ హింస లేకుండా ఉండాలి. గతంలో చర్చలకు నాయకత్వం వహించిన జానారెడ్డి లాంటివారికి అనుభవం ఉంది. ప్రభుత్వం పరంగా కేంద్రం, రాష్ట్రం శాంతి భద్రతలు సంబంధించి ఏ మార్గం వహిస్తే బాగుంటుందని సమస్య పరిష్కారం అయ్యేలా చూసుకోవాలి. ప్రాణాలు తీసుకోవడం వల్ల వచ్చేది లేదు.




# కవిత్వానికి సమాజమే పునాది






- **మనిషిని ఉన్నతీకరించడమే కవిత్వ లక్ష్యం కావాలి..**
- **మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో పుస్తకాల ఆవిష్కరణ సభ..**
- **హాజరైన డాక్టర్ నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్..**

**ప్రజాక్షేత్రం సిద్దిపేట మే 9**

కవిత్వానికి సమాజమే పునాది అని వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్. వేణుగోపాల్ అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సిద్దిపేటకు చెందిన ప్రముఖ కవి అలాజిపూర్ కిషన్ కవిత్వం పుస్తకాలు "పేగు తెగిన పాట" " వడిసెల "ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాలను ఆవిష్కరించి ఆయన ప్రసంగించారు. మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె. రంగాచారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్ వేణుగోపాల్ మాట్లాడుతూ కవిత్వానికి సామాజిక నేపథ్యమే పునాదిగా రచనలు చేస్తే ఆ రచన సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని అన్నారు.వ్యక్తిగతమైన సాహిత్యం ఎక్కువ కాలం నిలబడేది కాదని అన్నారు. వ్యక్తిగతమైన అంశాల ప్రాతిపదికన రాసిన కవిత్వానికి కూడా సమాజమే ప్రధాన వస్తువుగా ఉంటుందని ఆయన అన్నారు. కవిత్వం ఏదైనా మనిషిని మనిషిగా నిలబెట్టడానికి, మనిషిని మరింత ఉన్నతీకరించడానికి, సమాజంలో మానవ సంబంధాలను పెంపొందించడానికి, ఉపయోగపడాలని ఆయన అన్నారు. ఇవాల్టి సమాజంలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వాటిని కవిత్వం ద్వారా ప్రతిబింబించే విధంగా కవులు తమ రచనలు చేయాల్సిన అవసరం ఉందని వేణుగోపాల్ అన్నారు.అనిచివేత, పీడన, స్వేచ్ఛ లేని, నిజాన్ని నిర్భయంగా చెప్పలేని, సమాజం సరైన దిశలో పయనించదని ఆయన అన్నారు. కవులుగా సమాజాన్ని ప్రజాస్వామీకరించే దిశగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిన అవసరం, సందర్భం ఇప్పుడు ఉన్నదని వేణుగోపాల్ చెప్పారు. ఆ దిశగా కవులు రచనలు చేయాలని అన్నారు. గత 30 ఏళ్లుగా సాహిత్య సృజన చేస్తున్న కవి అలాజ్ పూర్ కిషన్ దాదాపు నాలుగు దశాబ్దాల సామాజిక పరిణామాలను తన రెండు పుస్తకాల్లో ప్రతిబింబించే విధంగా రచనలు చేశాడని ఆయన అన్నారు.30 ఏళ్ల క్రితం వచ్చిన వడిసెల పుస్తకం సాహిత్య ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకుందని ఆయన అన్నారు. ఆ సంపుటిలో తెలంగాణ ప్రాంతంలో జరిగిన అనేక అనిచివేత,నిర్బంధ అమానవీయ ఘటనలను తన కవిత్వం ద్వారా కిషన్ రికార్డు చేశాడని అన్నారు. రెండో కవితా సంపుటిగా ఇప్పుడు వచ్చిన పేగు తెగిన పాట ఆయన సాహిత్య పరిపక్వ దశకు నిదర్శనమని అన్నారు.సమాజంలో ప్రజాస్వామిక వాతావరణం కొరవడుతున్న ప్రస్తుత నేపథ్యంలో కవులు మరింత అప్రమత్తతతో ప్రజల పక్షాన సాహిత్యాన్ని వెలువరించాల్సిన అవసరం ఉందని ఎన్ వేణుగోపాల్ అన్నారు. మంజీరా రచయితల సంఘం గత 40 ఏళ్లుగా అనేకమంది కవుల్ని సాహిత్య ప్రపంచానికి అందించిందని అన్నారు. మరసం కవులు ఒక స్పష్టమైన సామాజిక దృక్పథంతో ప్రజల పక్షాన నిలబడి సాహిత్యాన్ని సృజన చేస్తున్నారని ఆయన అభినందించారు. ప్రఖ్యాత కవి రచయిత తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ కిషన్ తన రెండు కవితా సంపుటిల ద్వారా ఎంత గొప్ప కవిత్వాన్ని రాశాడో అంతే గొప్పగా ఒక సాహిత్య కార్యకర్తగా కూడా పనిచేశాడని అన్నారు. మంజీరా రచయితల సంఘం గత 40 ఏళ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లా నుండి ప్రారంభమై తెలుగు నేలపై గొప్ప సాహిత్య సంస్థగా ఎదగడంలో కిషన్ నిర్వహించిన పాత్ర గొప్పదని చెప్పారు. తాను అనేక సమస్యలతో సతమతమైన కిషన్ ఏనాడు సాహిత్యాన్ని విడిచి పెట్టలేదని తన ప్రయాణాన్ని ఆపలేదని చెప్పారు. వడిసెలతో ప్రారంభమైన ఆయన సాహిత్య ప్రస్థానం ఇప్పుడు పేగు తెగిన పాట సంపుటి ద్వారా మరింత సుసంపన్నమైందని అన్నారు. శాసనమండలి సభ్యులు, ప్రముఖ కవి గాయకుడు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ తనను సాహిత్యం వైపు నడిపించిన వాళ్లలో ప్రధముడు అలాజ్ పూర్ కిషన్ అని అన్నారు. 30 ఏళ్ల క్రితం పరిచయమైన కిషన్ సాహిత్యంలో తనకు ఓనమాలు దిద్దించాడని చెప్పారు. నవ్య కళ నికేతన్ అనే సాంస్కృతిక సంస్థ ద్వారా ఏర్పడ్డ పరిచయం ఇప్పటివరకు కిషన్ తో కొనసాగించేలా చేస్తున్నదని అన్నారు.మంజీరా రచయితల సంఘాన్ని తమకు పరిచయం చేసి తనకు సామాజిక దృక్పథాన్ని అందించడంలో కిషన్ నందిని సిద్ధారెడ్డి గారి పాత్ర గొప్పదని చెప్పారు. కిషన్ మొట్టమొదటి కవితా సంపుటి వడిసెల ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేట ప్రాంతంలో జరిగిన అనేక సంఘటనలకు ప్రతిబింబంగా వచ్చిందని అన్నారు. ప్రస్తుత రెండో కవితా సంపుటిలో ఆయన కవిత్వం మొత్తంగా ఒక ప్రాపంచిక దృక్పథంతో కొనసాగిందని అన్నారు. కిషన్ ఎక్కువ చదువుకోకపోయినా సమాజాన్ని ఆయన నిరంతరం అధ్యయనం చేయడం ద్వారా గొప్ప కవిత్వాన్ని రాయగలిగాడని చెప్పారు. ఏ కవికైనా సామాజిక దృక్పథమే కవిత్వ ప్రధాన వస్తువు కావాల్సిన అవసరం ఉందని దేశపతి శ్రీనివాస్ అన్నారు. టీఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షులు మరసం వ్యవస్థాపకుల్లో ఒకరు అయిన దేవి ప్రసాద్ మాట్లాడుతూ మంజీరా రచయితల సంఘం గత 40 ఏళ్లుగా సాహిత్య రంగానికి చేసిన కృషి అనిర్వచనీయమైనదని అన్నారు. సమాజంలో జరిగిన అనేక పరిణామాలలో మంజీరా రచయితల సంఘం ఉందని, మంజీరా కవులు ఒక సామాజిక బాధ్యతగా తమ కవిత్వాన్ని వెలువరిస్తూ ప్రజల పక్షాన నిలబడ్డారని అన్నారు. సామాజిక ఉద్యమకారుడు దారం మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రశ్నించే వారిని నిర్మూలించే పద్ధతి కొనసాగుతుందని ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. అప్రజా స్వామిక విధానాలకు వ్యతిరేకంగా కవులు తమ గళాలని విప్పాల్సిన అవసరం ఉందని దారం మల్లారెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు కే.అంజయ్య మంజీర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, తోట అశోక్, మరసం ఉపాధ్యక్షులు అలాజ్ పూర్ శ్రీనివాస్, వేముగంటి రఘునందన్ వేముగంటి మురళి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా అలాజ్ పూర్ కిషన్ పుస్తకాలు వడిసెల పేగు తెగిన పాట కవిత్వ పుస్తకాలను ఎన్ వేణుగోపాల్,నందిని సిద్ధారెడ్డి,దేశపతి శ్రీనివాస్, తో కలిసి ఆవిష్కరించారు సభలో పెద్ద సంఖ్యలోసాహితీ ప్రియులు పాల్గొన్నారు.



## రైతుల సమస్యలు తెలుసుకున్న కలెక్టర్

**ప్రజాక్షేత్రం, సిద్దిపేట అర్బన్:**

సిద్దిపేట రూరల్ మండలంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి పర్యటించారు. పుల్లూరు గ్రామంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్య లు తెలుసుకున్నారు. రైతులు మాట్లాడు తూ గన్ని బ్యాగ్, లారీల కొరత, టార్పాలిన్ కవర్లు అందజేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. తేమశాతం రాగానే గన్ని బ్యాగులు అందజేయాలని సెంటర్ సిబ్బందికి, టార్పాలిన్ కవర్లు, లోడ్ చేయడానికి లారీల కొరత తీర్చాల్సిందిగా సివిల్ సప్లై డి ఎం, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. పుల్లూరు గ్రామంలో కొనుగోలు కేంద్రం కోసం గవర్నమెంట్ భూమి ఉందని గ్రామస్తులు తెలుపగా తహసిల్దార్ ని పంపించి ఎంక్వయిరీ చేయిస్తానని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సెంటర్లలో అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలని సెంటర్ సిబ్బందికి తెలిపారు. చింతమడక, మాచాపూర్, సీతారాం పల్లి గ్రామాలలో నిర్మాణంలో పెండింగ్లో ఉన్న గృహాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. నిర్మాణం పూర్తయి లబ్ధిదారులకు అందజేసిన గృహాలకు డ్రైనేజీ వ్యవస్థ, మిషన్ భగీరథ కనెక్షన్ వంటి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. నిర్మాణం చేపడుతున్న గృహాలను నాణ్యత ప్రమాణాలు పాటించి వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ఇదివరకు మంజూరు అయిన గృహాలను నిర్మించేలా చూస్తానని అదనపు గృహాల కొరకు ఇందిరమ్మ ఇల్లు పథకంలో మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు ఎవరూ కూడా అధైర్య పడవద్దని ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుందని తెలిపారు. కలెక్టర్ వెంట తాసిల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీవో, ఎంపీవో, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## సఫాయి కార్మికుడు మృతి చెందడం చాలా బాధాకరం

**మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి**

**ప్రజాక్షేత్రం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి మే:09**కనపడితే చాలు ప్రేమతో కడుపు నిండా మాట్లాడే ఎర్రోళ్ల రాజయ్య అకాల మరణం చాలా బాధాకరమని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి విచారం వ్యక్తం చేశారు. పల్లెపహాడ్ మల్లన్న సాగర్ లో గ్రామం ముంపుకు గురికావడంతో 5 ఏళ్లు వెంకట్రావుపేట లో ఉండటం జరిగింది. జీడిపల్లి అంజమ్మ ప్రతాప్ రెడ్డి సర్పంచ్ గా ఉన్న సమయంలో సపాయి కార్మికునిగా విలువైన సేవలు అందించారని గుర్తు చేశారు. రాజయ్య మరణ వార్త తెలియగానే ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్ కు వెళ్లి అంతిమ యాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు బద్దయ్య కోడలు బాబాయమ్మ లను ఓదార్చడం జరిగింది. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం అందించాలని భగవంతుణ్ణి కోరుకున్నారు. పరామర్శించిన వారిలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య, నాయకులు బండారు స్వామి గౌడ్, పులిగారి లక్ష్మణ్, చంద్రం, స్వామి, రాంబాబు, బాబు తదితరులు ఉన్నారు.





## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు..!

**దుబ్బాక ఎస్సై గంగరాజు**

**దుబ్బాక ప్రజాక్షేత్రంమే 9** మైనర్లు వాహనాలు నడిపే కఠిన చర్యలు తప్పవని, ప్రతి ద్విచక్ర వాహన నడిపే వ్యక్తి హెల్మెట్ తప్పనిసరి వాడుకోవాలని దుబ్బాక ఎస్సై వడ్ల గంగరాజు అన్నారు. దుబ్బాక పట్టణంలోని స్థానిక బజాజ్ వాహన షోరూం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన క్వాలిటీ బేకరిని ఆయన ప్రారంభించి మాట్లాడారు.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ను వాడుకోవాలని సూచించారు. నేటి కాలంలో రోడ్డు ప్రమాదాలు అనేకంగా జరుగుతున్నది అందరికీ తెలిసిందేనని అందుకోసం ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలు కాపాడుకునేందుకు హెల్మెట్ ను వాడాలన్నారు. అంతేకాకుండా 18 సంవత్సరాలు నిండని మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే డ్రైవింగ్ చేసిన మైనర్ పై వాహనం ఇచ్చిన తల్లి దండ్రుల పై కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా భద్రతను ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బిక్షపతి, దుబ్బాక మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల దేవేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# యువత, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- **యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవించి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దు**
- **తాత్కాలిక ఆనందం కొరకు కుటుంబాలను దూరం చేసుకోవద్దు**
- **మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలి**

**పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ**

**ప్రజాక్షేత్రం సిద్దిపేట మే 9:**

పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు, యువత గంజాయి మరియు ఇతర నిషేధిత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి వారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు కానీ, పిల్లలు కానీ, తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలు అయినట్లయితే వారి యొక్క వివరాలను ఈ నెంబర్ సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ 8712667100 కు ఫోన్ చేసి తెలియజేయాలని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిస అయినట్లయితే వారిని డి అడిక్షన్ సెంటర్ ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చి మత్తు పదార్థాలను మానిపించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. గంజాయి మరియు ఇతర నిషేధితమత్తు పదార్థాలు పెంచిన, స్వీకరించిన, రవాణా చేసిన వారి పైన చట్ట రీత్యా చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. మాదక ద్రవ్యాలను అరికట్టడం లో ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని సూచించారు. గంజాయికి బానిసలుగా మారి యువత తమ భవిష్యత్తు నాశనం చేసుకొంటుందని దాని వలన వారి జీవితాలు విచ్చిన్నం కావడంతో పాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురైవుతున్నారని, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరు స్వచ్చందంగా ముందుకు వచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచబడుతాయని, గంజాయి రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు.



# ప్రెగ్నెన్సీలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా

బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గతేడాది సెప్టెంబర్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన ప్రెగ్నెన్సీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "మాతృత్వపు ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. ముఖ్యంగా 8, 9 నెలల్లో చాలా కష్టంగా అనిపించింది. ఆ సమయంలో నా కుటుంబం, స్నేహితులు ఎప్పుడూ నాతోనే ఉన్నారు. నా బిడ్డకు పేరు పెట్టడం కోసం ఎంతో పరిశీలించాను. 'దువా' అని నిర్ణయించా. ఈ పేరుకు అర్థం ఏంటని చాలామంది అడుగుతూ ఉంటారు. 'దువా' అంటే ప్రార్థన అని అర్థం. నిజ జీవితంలో ఒక తల్లి పాత్ర పోషించడం సవాలే. ప్రస్తుతం నేను నా జీవితంలో మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నా. ఇకపై షూటింగ్‌లలో పాల్గొనేందుకు సిద్ధమవ్వాలి. నా కుమార్తెకు తల్లిగా నా బాధ్యతలను నిర్వర్తిస్తూనే నా వృత్తి అయిన సినిమా షూటింగ్‌లో పాల్గొంటా" అని చెప్పారు.



## మహాభారతంలో కృష్ణుడిగా
# ఆమిర్ ఖాన్!

తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహాభారతం' గురించి బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ మరోసారి మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా తన మనసులో నాటుకున్న ఈ ప్రాజెక్ట్‌ను తెరపై తీసుకురావడం తన జీవిత లక్ష్యమని Aచెప్పారు. ఈ సినిమా భారతీయ చరిత్రలోనే ఓ గొప్ప సినిమాగా నిలవబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తనకు అత్యంత ఇష్టమైన పాత్ర ఏదో కూడా వెల్లడించారు. ఆమీర్ మాట్లాడుతూ.."మహాభారతం కథను తెరపై చూపించడం చాలా కాలంగా నా కల. ఇది కేవలం ఒక సినిమా కాదు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల మీద ఆధారపడిన గొప్ప ఇతిహాసం. దీన్ని ప్రేక్షకులకు అంతగా ప్రభావితం చేసే విధంగా తీర్చిదిద్దాలంటే అపారమైన శ్రమ, సమయం, అంకితభావం అవసరం. కానీ ఈ ప్రయాణం ఎంత కష్టమైనదైనా, ఈ కథ ఎప్పటికీ నిరాశ పరచదు."ఈ కథలో చాలా పాత్రలు ఉండొచ్చు. కానీ నన్ను వ్యక్తిగా చాలా ప్రభావితం చేసిన పాత్ర కృష్ణుడిది. ఆయన పాత్ర అంటే నాకు ఎంతో ఇష్టం. ఆ పాత్రలో ఉన్న తెలివి,న్యాయబద్ధత నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి. అందుకే 'మహాభారతం'లో కృష్ణుడిగా నటించాలన్నదే నా కోరిక అని చెప్పారు



# ఎవరినీ సాయం అడగాలనుకోలేదు

సమంత తన నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'లో రూపొందిన తొలి సినిమా 'శుభం'. ఈ సినిమా ప్రచారంలో సమంత బిజీబిజీగా ఉన్నారు. ఇందులోభాగంగా ఆసక్తికర విషయాలు పంచుకోవడంతో ఆమె పేరు ట్రెండ్ అవుతోంది. తన తర్వాతి సినిమా గురించి తాజాగా మాట్లాడారు. "నేను శుభంలో అతిథి పాత్ర పోషించాల్సింది కాదు. కానీ నిర్మాతగా నా తొలి చిత్రం కోసం నేను ఎవరినీ సాయం అడగాలనుకోలేదు. అందుకే నేనే నటించాను. సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లే బాధ్యతను కూడా నేనే తీసుకున్నాను. రిలీజ్ వరకు మాత్రమే ప్రచారం చేస్తాను. తర్వాత సినిమా పూర్తిగా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది'' అని చెప్పారు. ఇక 'శుభం' విడుదల సందర్భంగా ఆమె కొన్ని ఫొటోలు షేర్ చేశారు. ప్రస్తుతం ఆ ఫొటోలతో పాటు వాటికి ఆమె పెట్టిన క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది.






# టైటిల్ క్రేజ్

'ఆపరేషన్ సిందూర్' ఈ పేరు ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఫుల్ క్రేజ్‌లో ఉంది. ఈ పేరు వింటేనే గర్వంతో దేశమంతా సెల్యూట్ చేస్తోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇండియన్ ఆర్మీ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ లో ఉగ్రమూకలు హతం అయిన సంగతి తెలిసిందే. దీంతో 'ఆపరేషన్ సిందూర్' పేరు ఓ బ్రాండ్ అయిపోయింది. ఈ పేరు కోసమే ఇప్పుడు బాలీవుడ్ బడా నిర్మాతలు పోటీ పడుతున్నారు. ఈ పేరును రిజిస్టర్ చేసుకునేందుకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 15 నిర్మాణ సంస్థలు పోటీ పడుతున్నాయి. టీ సిరీస్, జీ స్టూడియోస్ వంటి బడా నిర్మాణ సంస్థలూ ఈ టైటిల్ కోసం అప్లై చేసుకున్నాయి. ఈ టైటిల్‌కు దరఖాస్తు చేసిన నిర్మాతల్లో ఒకరైన అకోశ్ పండిట్ మాట్లాడుతూ.. "ఇదే టాపిక్‌పై సినిమా తెరకెక్కుతుందా? అనే విషయాన్ని ఇప్పుడే చెప్పలేం. అందరి దృష్టిని ఆకర్షించగలిగే పేరు తమ సినిమాలకు పెట్టేందుకు దర్శక, నిర్మాతలు ఉత్సాహం చూపిస్తుంటారు. పేరు అనుకోకుండా ఏ సినిమానీ ప్లాన్ చేయలేం. తాజా పరిణామాల నేపథ్యంలో చాలామంది 'ఆపరేషన్ సిందూర్' టైటిల్‌కు దరఖాస్తు చేశారు. వారంతా కచ్చితంగా సినిమా తీస్తారని లేదని చెప్పారు.

# రీమేకులు కలిసొచ్చేనా..?

తెలుగు చిత్ర పరిశ్రమలో చిన్న హీరో నుండి స్టార్ హీరోల వరకు రీమేక్ సినిమాలపై మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ రీమెక్ అనేది ఇప్పటి విషయం కాదంట.. గోల్డెన్ డేస్ నుంచి ఆనవాయితీగా వస్తుందని సినీ ప్రముఖులు చెబుతున్నారు. కొంత కాలం వెనక్కి వెళ్తే... ఓటీటీ, యూట్యూబులు అందుబాటులో లేవు. ఎక్కడైనా ఓ చిత్రం విడుదలై బాగుందనుకుంటే దానిని తమ భాషలో రీమేక్ చేసుకునేవారు. ఇప్పుడు కాలం మారింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధారణంగా కథ నచ్చితే ఆ సినిమాను ఇతర భాషలకు రీమేక్ చేస్తున్నారు. సినిమాలో కథ బలంతో మినిమమ్ హిట్ అందుకోవచ్చు గానీ.. లోకల్ ఆడియెన్స్ కు కథ కనెక్ట్ అవ్వకపోతే రిస్కే. ఇక చాలా సందర్భాల్లో రీమేక్ సినిమాలు బెడిసికొట్టవచ్చు. ఇండస్ట్రీలో విక్టరీ వెంకటేష్ వంటి స్టార్ హీరోలు సైతం రీమెక్ సినిమాలో నటించారు. ఆలా వాళ్ళ సినీ జీవితంలో సినిమాల్లో రీమేక్స్ ఎక్కువగా ఉంటాయి. ఇక ఒకప్పుడు జనాలు రీమేక్ అని భేదం చూపేవారు కాదు. అంతేకాదు.. కంటెంట్ నచ్చితే కాపీ కొట్టినా పట్టించుకునేవారు కాదంటా. కానీ ప్రస్తుతం గ్లోబల్ ఈజ్ లోకల్ అనే ట్రెండ్ నడుస్తోంది కాబట్టి ఎలాంటి రీమేక్ చేసినా కూడా జనాలు అప్పుడే బేధాలు చూపడం మొదలు పెడుతున్నారు. అంతేకాదు రీమేక్ ట్రై చేసినా కూడా ఎంతో కొంత భిన్నంగా ట్రై చేస్తే బెటర్ అని చెప్పుకోవచ్చు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, #6-31880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR.
Phone number 9177920459, email id : prajakshetram1@gmail.com, https://prajakshetram.in, RNI NO. TELTEL/12330